అమరావతి
శనివారం
3-2-2018
సంపుటి: 2, సంచిక: 65
పేజీలు: 8+16, వెల: రూ. 5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



ఆపరేషన్ వరల్డ్ కప్

నాలుగో టైటిల్‌పై భారత యువ సేన దృష్టి

స్పోర్ట్స్‌లో..

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM



ఆరోగ్య బీమా..

అప్పుడే కాదు


7లో..

కొత్త ఆర్థిక సంవత్సరంలో మొదలు: జైట్లీ

పోరాడదాం!

బడ్జెట్‌పై నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- నిశ్శబ్దంగా ఉండిపోతే మనకే ముప్పు..
- ప్రజల్లోనూ తీవ్రస్థాయిలో అసంతృప్తి
- కానీ.. ఎవరూ అతిగా స్పందించకండి
- చురుక్కుమనాలి.. కరుకుదనం వద్దు
- ఎంపీల రాజీనామా పరిష్కారం కాదు
- కార్యాచరణపై ఆలోచించి నిర్ణయిద్దాం
- బీజేపీ నేతలు రాష్ట్రానికి ఏం తెచ్చారు?
- ప్రతిపక్ష పార్టీకి విమర్శించే హక్కు లేదు
- అన్యాయం చేస్తే అయిపూఅజా ఉండరు
- టీడీపీ 'సమన్వయ' భేటీలో వ్యాఖ్యలు



అమరావతి, ఫిబ్రవరి 2 (మనం ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో అన్యాయంపై కేంద్రంతో పోరాటం కొనసాగిద్దామని తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు తమ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం తన నివాసంలో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ సందర్భంగా నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ''కేంద్ర బడ్జెట్‌లో కర్ణాటక, మహారాష్ట్రలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. కొత్త రాష్ట్రం ఏపీకి ఎలాంటి కేటాయింపులూ లేవు. బడ్జెట్‌పై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అన్ని రాష్ట్రాలకూ సమానంగా ఇస్తే ఏ బాధా ఉండేది కాదు. బడ్జెట్ చూశాక ఎంపీలంతా ఎంతో బాధ పడ్డారు. రాజీనామా చేస్తామన్నారు... కానీ, దానివల్ల సమస్య పరిష్కారం అవుతుందా? అందుకే తొందర పడద్దని వారించాను. అలాగని మిగతా 5లో..



కేబినెట్ భేటీ 2లో..



కేంద్రానికి టీడీపీ

గుడ్‌బై?

రాజీనామాకు సిద్ధపడ్డ మంత్రులు

- అదే బాటలో పార్లమెంట్ సభ్యులు
- ఏపీపై కేంద్రం కక్షగట్టిందన్న భావన
- బడ్జెట్‌లో అన్యాయంపై ఆక్రోశం
- రేపు ఎంపీలతో చంద్రబాబు భేటీ
- కీలక నిర్ణయం ప్రకటించే అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 2 (మనం ప్రతినిధి):

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో ఉన్న టీడీపీ మంత్రులు రాజీనామా చేసేందుకు సిద్ధపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. టీడీపీ పార్లమెంట్ సభ్యులు కూడా తమ పదవులకు రాజీనామా చేయాలని తీర్మానించుకున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై కక్ష కట్టిందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ కోరినన్ని సీట్లు టీడీపీ ఇచ్చే అవకాశాలు లేవన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ఇతర సీనియర్ నేతలు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని అభిప్రాయపడినట్టు తెలిసింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం మిగతా 5లో..



ప్రత్యేక హోదా.. ఉద్యమం మళ్లీ!



ఎస్కేయూ కేంద్రంగా పోరాటం

- విద్యార్థులకు వైసీపీ నేతల మద్దతు
- రోడ్డుపై వంటా వార్పు.. ఆందోళన
- చంద్రబాబు తీరుపై ఆగ్రహం
- గుంతకల్లు రైల్వే జోన్‌కు డిమాండ్

అనంతపురం, ఫిబ్రవరి 2 (మనం న్యూస్ బ్యూరో):


కేంద్ర బడ్జెట్‌లో విభజన చట్టం హామీలను విస్మరించిందని.. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలను కేంద్రం పెడచెవిన పెట్టిందని విద్యార్థి లోకం భగ్గుమంది. అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ (ఎస్కేయూ) కేంద్రంగా ప్రత్యేక హోదా ఉద్యమం మళ్లీ మిగతా 5లో..

కేవీపీ! పిచ్చి పట్టిందా?

- వెల్ ఖాళీ చేసి సీటు దగ్గరకు వెళ్లు
- రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కురియన్ ఆగ్రహం
- ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని సభలో రామచంద్రారావు నిరసన
- సహనం కోల్పోయిన పీజే



5లో..



మేడారంలో వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య

మన ఆధ్యాత్మిక సంపద మేడారం

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- దేవతలకు మొక్కుల చెల్లింపు
- మేడారం జాతర ఏర్పాట్లపై హర్షం
- ఆచారాలను కాపాడుకోవాలని హితవు
- వెంట వచ్చిన తెలంగాణ మంత్రులు

మేడారం,ఫిభ్రవరి02,మనంన్యూస్ః

తెలంగాణలో జరుగుతున్న మేడారం జాతర ఆధ్యాత్మిక సంపదకు గుర్తింపుగా మిగులుతుందని, దేవతల ఆరాధనతో జీవితాలు సుఖమయం అవుతాయని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం ఉదయం మిగతా 5లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శనివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలిగాలుల తీవ్రత పెరుగుతుంది. గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు

గాలిలో తేమ: 40 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: తదియ ఉ.10.36 తదుపరి చవితి; నక్షత్రం: పుబ్బ ఉ.11.22 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.11.45-1.18; దుర్ముహూర్తం: ఉ.6.51-8.22; రాహుకాలం: ఉ.9.41-11.05; అమృతఘడియలు: తె.5.26-6.56; శుభసమయం: సా.5.00-6.00.

సూర్యోదయం: 6.51

సూర్యాస్తమయం: 6.09

అది రాజ్యాంగ విరుద్ధం

ఏపీ విద్యుత్ ఉద్యోగుల రిలీవ్‌పై హైకోర్టు

- తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు కొట్టివేత
- నాలుగు వారాల్లో విభజన పూర్తి చేయండి
- కొత్తగా విభజన కమిటీ వేయాలి లేదా.. జాయింట్ కమిటీని కొనసాగించాలి
- ఈ ప్రక్రియ రెండు వారాల్లో ముగియాలి
- ఆ తర్వాతే పంపకాల ప్రక్రియ చేపట్టాలి
- ప్రక్రియంతా నాలుగు మాసాల్లో పూర్తి
- తెలుగు రాష్ట్రాలకు న్యాయస్థానం ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (మనం లీగల్ ప్రతినిధి):

విద్యుత్ ఉద్యోగుల విభజనపై తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఉద్యోగుల విభజనపై తెలంగాణ విద్యుత్ సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. న్యాయమూర్తులు జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ కీలక తీర్పు మిగతా 5లో..

నిజాలే ఉన్నాయా?

విశాఖ భూ కబ్జాపై సీపీకి 'సిట్' నివేదిక

- సీఎం అపాయింట్‌మెంట్ దొరక్క జాప్యం
- పెద్దల పేర్లు బట్టబయలా.. బుట్టదాఖలా!
- ముఖ్యమంత్రి దృష్టికెళ్తే పరిణామాలేమిటి?
- కాలహరణం తప్పదని పలువురి సందేహం



విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (మనం న్యూస్‌బ్యూరో):

విశాఖలో భూ కుంభకోణంపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదికలో ఏముంది? ఎప్పుడో డిసెంబరు చివరి వారంలోనే సిద్ధమైన ఈ నివేదికను 'సిట్' అధికారులు సోమవారం నాడు నగర పోలీస్ కమిషనర్ యోగానంద్‌కు అందజేశారు. వాస్తవానికి దీన్ని నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకే సమర్పించాల్సి ఉంది. అయితే, చాలాసార్లు ప్రయత్నించినా సీఎం అపాయింట్‌మెంట్ లభించక పోవడంతో దాదాపు నెలన్నరగా ప్రదక్షిణలతోనే కాలం గడచిపోయింది. ఎట్టకేలకు వినీత్ బ్రిజాల్ నేతృత్వం లోని సిట్ బృందం కమిషనర్‌కు మిగతా 5లో..

విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి

- విదేశీ విద్యార్థులను ఆకర్షించాలి
- నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ గోల్డెన్ జూబ్లీ వేడుకలో జస్టిస్ చలమేశ్వర్
- 2 కోట్లు విరాళం ఇచ్చిన పూర్వ విద్యార్థులు

గుంటూరు, ఫిబ్రవరి 2, (మనం న్యూస్): నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థల్లో మార్పులు రావాలని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. శుక్రవారం గుంటూరు జేకేసీ కాలేజీలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో జస్టిస్ చలమేశ్వర్‌తో పాటు స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఎంపీ రాయపాటి సాంబశివరావు, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా కలిసి నాగార్జున సొసైటీకి రూ.2 కోట్ల విరాళం ఇచ్చారు. అనంతరం జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం చదువుకునేందుకు వసతులు తక్కువగా ఉండేవని, కాలేజీ చదువుల కోసమైతే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని చెప్పారు. విద్య ప్రాధాన్యతను గుర్తించి నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించిన ఎనిమిది రకాల కాలేజీలు నడపడం అభినందనీయమన్నారు. అయితే ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు రావాలని పిలుపునిచ్చారు. తాను పలు దేశాల్లో పర్యటించినప్పుడు ఎక్కడ చూసినా భారత విద్యార్థులు ఎక్కువగా కనిపించేవారని, కానీ ఆయా దేశాల విద్యార్థులు మన దేశానికి ఎందుకు రావడం లేదో ఆలోచించుకోవాలని సూచించారు. విదేశీ విద్యార్థులను ఆకర్షించేలా మన విద్యాసంస్థల యాజమాన్యాల చర్యలు ఉండాలన్నారు. శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ రాబోయే కాలంలో మరింతగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ శతవార్షికోత్సవ ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు ఇతర దేశాల్లో బాగా రాణిస్తుండటం అధ్యాపకుల గొప్పదనమేనన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీకి పూర్వ విద్యార్థులు రూ.2 కోట్లు విరాళంగా అందించడం అభినందనీయమని అన్నారు.

రాజీనామాకు సిద్ధం: రాయపాటి

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై తాను రాజీనామాకు సిద్ధమని టీడీపీ ఎంపీ రాయపాటి సాంబశివరావు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుతో సమావేశమై దీని నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంపీలకు ఎంతో విలువ ఉండేదని కానీ, ఆర్‌ఎస్ఎస్ ఏది చెబితే బీజేపీ ప్రభుత్వం అదే చేస్తోందని ఆయన అన్నారు. ఇప్పుడు ఢిల్లీలో ఎంపీలను హీనంగా చూస్తున్నారని, ఏపీకి అన్యాయం చేస్తే కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి పడుతుందని హెచ్చరించారు.

బడ్జెట్‌లో మార్పులు చేయాలి: మోదుగుల

ఆంధ్రప్రదేశ్‌ను విస్మరించి బీజేపీ క్షమించరాని తప్పు చేసిందని టీడీపీ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో వెంటనే మార్పులు చేసి ఏపీకి కేటాయింపులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమయంలో ఎంపీగా లేనందుకు బాధపడుతున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్లమెంట్ తలుపులు మూసి అన్యాయం చేస్తే, బీజేపీ తలుపులు తీసే అన్యాయం చేసిందని దుయ్యబట్టారు.



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

- టీడీపీ, వైసీపీల బలహీనతే శాపం: రఘువీరా



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (మనం ప్రతినిధి): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందిరా భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ఏపీని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, రైల్వే జోన్, రెవెన్యూ లోటు భర్తీ అంశాల ప్రస్తావనే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ మట్టి ఇచ్చినప్పుడే ఏపీ ప్రభుత్వం మేల్కోవాలని తాను చెబితే ముఖ్యమంత్రి చంద్రబాబు వినలేదన్నారు. టీడీపీ, వైసీపీల బలహీనతే ఏపీకి శాపంగా మారాయన్నారు. చంద్రబాబు, జగన్ కేసుల భయంతో కేంద్రంతో రాజీపడ్డారని ఆరోపించారు. ఏపీకి అన్యాయం జరగడానికి టీడీపీ, వైసీపీ నైతిక బాధ్యత వహించి.. ఏపీ ఎంపీలు తక్షణమే రాజీనామా చేయాలని రఘువీరా డిమాండ్ చేశారు.

పవన్ వైఖరి ఏంటో చెప్పాలి


- రాష్ట్ర ప్రయోజనాలకు పోరాటం: సీపీఎం మధు



గుంటూరు, ఫిబ్రవరి 2 (మనం న్యూస్ ప్రతినిధి): జనసేనతో పొత్తు పెట్టుకుంటామని, బీజేపీ నుంచి బయటకు వస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారని.. పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరి ఏంటో వెల్లడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. శుక్రవారం గుంటూరులోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాలు చీలుదారులు అవుతున్నాయన్నారు. వామపక్షాలు, ప్రజల పక్షాన కలిసొచ్చే వాళ్లు అనేక మంది ఉన్నారన్నారు. తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో వామపక్షాలను కలుపుకొని, చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పవన్ కల్యాణ్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరు ముందుకొచ్చినా కలిసి పోరాడుతామని చెప్పారు. కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్ కోసం పోరాటం చేస్తామని మధు తెలిపారు.

బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి


- రేపు రాష్ట్ర సరిహద్దులో నిరసన: సినీ నటుడు భగవాన్



అమరావతి, ఫిబ్రవరి 2 (మనం ప్రతినిధి): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపించారని.. తనను తీవ్రంగా కలిచివేస్తోందని సినీ నటుడు భగవాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్ని సార్లు ఢిల్లీ వెళ్లినా కేంద్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. కేంద్రం వైఖరికి నిరసనగా ఆదివారం తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో నిరసన తెలియజేస్తానని భగవాన్ 'మనం ప్రతినిధికి' ఫోన్ చేసి చెప్పారు. బ్రహ్మాచారులు, అంజలి ఐ లవ్ యూ, ఆ.. నలుగురు, విఘ్నేష్, రెండు గుండెల చప్పుడు తదితర సినిమాల్లో భగవాన్ నటించారు.

కంటెంట్, డ్రోన్ కార్పొరేషన్లు

- ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం
- 2019 మార్చికి 5 లక్షల ఇళ్లు పూర్తి
- 28 వేల కోట్లు ఖర్చుతో నిర్మాణం
- సమావేశంలో కీలక నిర్ణయాలు



అమరావతి, ఫిబ్రవరి 2 (మనం ప్రతినిధి): ఏపీ కంటెంట్ కార్పొరేషన్, డ్రోన్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి కాలువ శ్రీనివాసులు వెల్లడించారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలన, విద్య, రాజ్యాంగం, ప్రసారం, సాంఘిక సంస్కరణలు, ఆర్థికశాస్త్రం, రాజకీయాలు మొదలైన వాటికి సంబంధించిన అనేక అంశాలలో నిరంతర పరిశోధన అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. కంటెంట్ కార్పొరేషన్ ఈ బాధ్యతలు నిర్వహించనుంది. అలాగే ప్రస్తుతం విస్తృతంగా పెరిగిన ప్రభుత్వ అవసరాలు, ప్రైవేట్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రోన్లకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నారు. పోలీస్, మైనింగ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, అగ్రి కల్చర్, జల వనరులు, అర్బన్ డెవలప్‌మెంట్, సర్వేలు, టూరిజం, ఎస్సెట్ మానిటరింగ్ తదితర సేవలకు వీటిని వినియోగించనున్నారు. టూడీ, త్రిడీ మోడల్స్‌లో హై రిజల్యూషన్ వీడియోలు తీసేందుకు, ఫోటోలు తీసేందుకు డ్రోన్లను విస్తృతంగా ఉపయోగిస్తారు. ఈ వ్యవహారాలన్నీ డ్రోన్ కార్పోరేషన్ పర్యవేక్షిస్తుంది. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా దీన్ని ఏర్పాటుచేస్తారు.

గుంటూరులో మతాశిశు ఆరోగ్య కేంద్రం

గుంటూరు జనరల్ ఆసుపత్రిలో 597 పడకలతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం 'మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్' ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.65 కోట్ల వ్యయంతో నెలకొల్పే 'ఎంసీహెచ్'ను 'గుంటూరు మెడికల్ కాలేజ్ అలుమ్నీ ఆఫ్ నార్త్ అమెరికా' (జీఎంసీఏఎన్ఏ) సహకారంతో ఏర్పాటు చేస్తారు. ఇందులో జీఎంసీఏఎన్ఏ రూ.30 కోట్లు అందిస్తుంది. జి ప్లస్ 5లో భవనాన్ని నిర్మిస్తారు. ప్రసూతి కోసం 300 పడకలు, చిన్నారుల కోసం 200, పీఐసీయూ కోసం 27, ఎస్ఐసీయూ కోసం 30, ఎన్ఐసీయూ కోసం 40 పడకల చొప్పున ఏర్పాటుచేస్తారు. 30 ఫ్యాకల్టీ రూములు, 300 మందికి సరిపడా కాన్ఫరెన్స్ హాలు నిర్మిస్తారు. 2,34,420 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రి నిర్మిస్తారు.

ఆరోగ్య రంగానికి ప్రపంచ బ్యాంక్ రుణం

ప్రపంచ బ్యాంక్ సహకారంతో రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని పటిష్టపరచాలన్న ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వైద్య మౌలిక వసతులను కల్పించేందుకు ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం తీసుకునేందుకు మంత్రి మండలి అనుమతి ఇచ్చింది. ఏపీలో వైద్య మౌలిక వసతుల కల్పనకు రూ.4,807 కోట్లు అవసరం అని ప్రతిపాదించగా, ఇందులో ప్రపంచ బ్యాంక్ నుంచి 70 శాతం (రూ.3,365 కోట్లు) రుణంగా తీసుకోవాలని, మిగిలిన 30 శాతం (రూ.1,442 కోట్లు) ఏపీ ప్రభుత్వం ఖర్చుపెట్టాలని నిర్ణయించారు.

అర్బన్ హౌసింగ్

పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వం చేపడుతున్న 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏపీ టీడ్కో నిధులు సమకూర్చునేందుకు బ్యాంకులకు ప్రభుత్వం హామీగా ఉండేందుకు మంత్రిమండలి అంగీకారం తెలిపింది. పట్టణ ప్రాంతాలలో రూ.38,265 కోట్ల వ్యయమయ్యే 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతోంది. ఈ ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం రూ.13,035 కోట్లు, కేంద్రం రూ.7,500 కోట్లు భరిస్తాయి. మిగిలిన మొత్తాన్ని లబ్దిదారుడు సమకూర్చుకుంటాడు.

ఎంపీల ట్రస్టుకు నిధులు

రాష్ట్రంలో పార్లమెంట్ నియోజకవర్గాలలో చేపట్టాల్సిన అభివృద్ధి అవసరాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల రూపకల్పనకు ఏర్పాటు చేసిన 'మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ అలయెన్స్ ఫర్ కలెక్టివ్ ట్రాన్స్‌ఫర్మేషన్' ట్రస్టుకు కోటీ 20 లక్షలు విడుదల చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది.

ఆరోగ్యమే మహా భాగ్యం

- దేశంలో కంటి వైద్యుల కొరత ఎక్కువ
- జిల్లా స్థాయిలో కంటి ఆస్పత్రులు రావాలి
- వైద్యరంగంలో పీపీపీలకు ప్రోత్సాహం
- అన్నీ ప్రభుత్వమే చేయలేదు: వెంకయ్య



అమరావతి, ఫిబ్రవరి 2 (మనం ప్రతినిధి): మారుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు అందిచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. వైద్య రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పవిత్రమైన వైద్య వృత్తిని లాభార్జన కోసం కాకుండా సేవా దృక్పథంతో చేపట్టినప్పుడే వైద్యులకు పేరు ప్రఖ్యాతులతోపాటు వారి జీవితాలకు ఒక సార్థకత ఉంటుందని చెప్పారు. మంచి వైద్యం అందించిన వారిని ప్రజలు బతికున్నంత కాలం గుర్తించుకుంటారని తెలిపారు. ప్రజలు దేవుడి తర్వాత ఎక్కువగా గుర్తుపెట్టుకొనేది వైద్యుడినేనని, డబ్బుతో అన్ని సాధ్యం కావని అన్నారు. శుక్రవారం విజయవాడలోని బెంజి సర్కిల్ వద్ద శంకర నేత్ర చికిత్సాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభా సుమారు 140 కోట్లకు వరకు ఉందని, దానికి అనుగుణంగా దేశంలో వైద్య సౌకర్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్ని పనులు ప్రభుత్వం ఒక్కటే చేయలేదని, ప్రైవేటు రంగాన్ని కూడా ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యం ఉంటేనే ఏదైనా చేయగలమని వెంకయ్య తెలిపారు. ఆధునిక పద్ధతుల్లో కంటి పరీక్షలు, చికిత్సలు చేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం నేడు అందుబాటులోకి వచ్చిందన్నారు. భారతదేశంలో 63 శాతానికి పైగా ప్రజల్లో కాటరాక్ట్ లోపంతో కంటి జబ్బులు వస్తున్నాయని, వాటిని సరైన సమయంలో గుర్తించి వైద్యం అందించి నిరోధించాలని అన్నారు. భారతదేశంలో ఆప్తమాలజీ డాక్టర్ల కొరత ఉందని అన్నారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్) కంటి ఆసుపత్రి రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్వీ ప్రసాద్, అరబిందో, శంకర నేత్రాలయ లాంటి ప్రసిద్ధి చెందిన మూడు సంస్థలు ఉన్నాయన్నారు. ప్రతి నగరంలో నేత్ర వైద్యశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ నుంచి ఎక్కువ మంది వైద్యం కోసం హైదరాబాద్, చెన్నై, మదురైకి వెళుతున్నారని, నేత్ర చికిత్సలు జిల్లా, డివిజన్ స్థాయిలో కూడా ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. శంకర నేత్ర చికిత్సాలయం ప్రజలకు సేవలందించే ఒక పెద్ద శిబిరంగా మారాలని, ఇక్కడి వైద్యులు అంకిత భావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వెంకయ్య సూచించారు. విజయవాడకు వన్నె తెచ్చే విధంగా శంకర నేత్ర చికిత్సాలయం ప్రజలకు సరైన వైద్యం అందించాలని ఆశిస్తున్నానన్నారు. కాగా, అంతకుముందు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆసుపత్రిలో ఏర్పాటు ఆధునిక వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం రిమోట్ కంట్రోల్ సాయంతో ఏలూరులోని శంకర నేత్రాలయ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- అర్ధరాత్రి బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు
- అమలాపురం-హైదరాబాద్ సర్వీసుకు ప్రమాదం



ఏలూరు సిటీ, ఫిబ్రవరి 2 (మనం న్యూస్): తూర్పు గోదావరి జిల్లా అమలాపురం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు 27 మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సు ఎక్కారు. గురువారం రాత్రి 8:30 గంటలకు బస్సు బయల్దేరింది. అర్ధరాత్రి 12:30 గంటల ప్రాంతంలో బస్సు జాతీయ రహదారిలో వెళ్తోంది. బస్సులోని ప్రయాణికులు అప్పటికే నిద్రలోకి జారుకున్నారు. ఇంతలో బస్సు బోల్తాపడటంతో నిద్రలో ఉన్నవారంతా ఉలిక్కిపడ్డారు. ప్రయాణికులు ఒకరిపై మరొకరు పడ్డారు. గాయాల బాధతో ఆర్తనాదాలు చేశారు. 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాద స్థలికి దగ్గరలో ఉన్న రోడ్డు భద్రత పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు అద్దాలను పగలగొట్టి ప్రయాణికులను బయటకు తీశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన వారిని మరో బస్సులో హైదరాబాద్ పంపించారు. డ్రైవర్ బస్సును వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని సమాచారం. బస్సు బోల్తా కొట్టిన సమయంలో రోడ్డు పక్కనే ఉన్న డివైడర్ అడ్డుగా ఉండడంతో బస్సు మరో పల్టీ కొట్టకుండా ఆగింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు మరో పల్టీ కొట్టినట్లయితే పక్కనే ఉన్న లోతైన గొయ్యిలో పడే ప్రమాదం ఉండేది. ప్రాణ నష్టం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఏడు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో కారు బోల్తా పడగా ఓ మహిళ మరణించింది.

ప్రాణాలు తీసిన చిన్న గొడవ

విశాఖపట్నం, ఫిబ్రవరి 2, మనం న్యూస్ బ్యూరో: విశాఖ నగరంలో మరో హత్య జరిగింది. చిన్న గొడవకు కలకత్తాకు చెందిన పారా సింగ్ అనే వ్యక్తి బలయ్యాడు. విశాఖ ఉక్కు కర్మాగారం సెక్టార్ 5 లోని త్రిష్ట పార్కులో శుక్రవారం ఉదయం ఈ హత్య జరిగింది. పార్కులో ఏర్పాటు చేయతలపెట్టిన క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన టెంట్లు వేసే విషయంలో పారా సింగ్, జకీర్ సింగ్ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య గురువారం రాత్రి గొడవ జరిగింది. ఇదే అంశంపై శుక్రవారం ఉదయం మళ్లీ వివాదం రాజుకుంది. ఆవేశంతో ఊగిపోయిన జకీర్ సింగ్, రాడ్‌తో పారా సింగ్ ఛాతీ, తల భాగాలపై బలంగా దాడిచేశాడు. దీంతో పారా సింగ్ అక్కడికక్కడే మరణించాడు. ఆయుదాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలకు కాంగ్రెస్ ఐటీ కో-ఆర్డినేటర్ల నియామకం

విజయవాడ, ఫిబ్రవరి 2, (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఐటీ సెల్ సోషల్ మీడియా విభాగం, రాష్ట్రంలోని 13 జిల్లాలకు కో-ఆర్డినేటర్లను నియమించింది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు డాక్టరు బీ సతీష్, విజయవాడ అర్బన్, రూరల్‌కు మనోహర్ గంగిరెడ్డి, ఉభయ గోదావరి జిల్లాలకు తాళ్లూరి విజయకుమార్, కృష్ణా గుంటూరు జిల్లాలకు ఎన్‌కే మౌలాలి, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు అంబటి రామకృష్ణ, రాయలసీమలోని 4 జిల్లాలకు పీఎన్ అహ్మద్ హుస్సేన్‌ను ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్ రఘువీరా రెడ్డి నియమించారు.

అంగన్‌వాడీల్లో 'విటమిన్' బియ్యం

- ఫోర్టిఫికేషన్‌కు గేట్స్ ఫౌండేషన్ సహకారం
- అమెరికాలో లోకేశ్‌కు ప్రతినిధుల హామీ



అమరావతి, ఫిబ్రవరి 2 (మనం ప్రతినిధి): ఏపీలోని అన్ని అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పౌష్టికాహారం లోపంతో వస్తున్న ఆరోగ్య సమస్యలను నివారించేందుకు 'విటమిన్ సమ్మిళిత' బియ్యాన్ని సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం మామూలు బియ్యంలో విటమిన్లు, ఇతర పోషకాలతో కలిపే 'రైస్ ఫోర్టిఫికేషన్'కు బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ సహకారం అందించనుందని వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న లోకేశ్ శుక్రవారం గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి నిక్ ఆస్టిన్ బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోషకాహార లోపాలతో వస్తున్న రోగాలపై పోరాడేందుకు సహకారం అందించాలని మంత్రి కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు. కాగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏపీలో తాము ముందుకు పోతున్నామని లోకేశ్ పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్యంలో బిల్ అండ్ మిలిందా గేట్స్ సహకారం కావాలని కోరారు. అనంతరం మంత్రి లోకేశ్ అమెజాన్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకెల్ పంక్ బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న క్లౌడ్ హబ్ పాలసీ బాగుందని, త్వరలోనే భారత్‌లోని తమ బృందాన్ని ఏపీకి పంపిస్తామని అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ ఫర్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ మైకెల్ పంక్ వెల్లడించారు. స్టార్టప్ కంపెనీలు, విద్యా, ఆరోగ్య రంగాలను అభివృద్ధి చేసేందుకు స్వచ్ఛందంగా తాము క్లౌడ్ సేవలు అందిస్తున్నామని హామీ ఇచ్చారు. కాగా వాషింగ్టన్ స్టేట్ ఇండియా ట్రేడ్ రిలేషన్స్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా వాషింగ్టన్-ఏపీ మధ్య బంధం మరింత బలపడిందని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఎన్నారైలు ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

అమెరికాలో ఉన్న ఎన్నారైలంతా ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అమెరికాలో శుక్రవారం ఆయన ఎన్నారైలతో సమావేశమయ్యారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ఈ సందర్భంగా చెప్పారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, పంచాయతీరాజ్ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామిక అభివృద్ధి కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరగుతోందన్నారు. త్వరలో ఎన్నారైల కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయబోతున్నామని ఆయన చెప్పారు.

బాబుపై అపార అభిమానం: కల్యాణరామన్

ఏపీలో త్వరలోనే శాంసంగ్ గ్లోబల్ ఈ-కామర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని శాంసంగ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ కల్యాణరామన్ శ్రీనివాసన్ చెప్పారు. అమెరికాలోని సియాటెల్‌లో మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో శాంసంగ్ పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ కోరారు. ''నాకు సీఎం చంద్రబాబుపై అపార అభిమానం ఉంది. చంద్రబాబు విజన్, విధానాలపై నాకు విశ్వాసం ఉంది. నేను అమెజాన్‌లో పనిచేస్తున్నప్పుడు హైదరాబాద్‌లో కంపెనీ ఏర్పాటుకు మూడు రోజుల్లో అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు సుమారుగా అక్కడ 30 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఏపీకి అన్ని రకాలుగా సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాం'' అని కల్యాణరామన్ చెప్పారు.


బాల్యస్మృతి

తెడ్డులేని పడవ



కాగితప్పడవ అంటే బాల్యస్మృతి మాత్రమే కాదు, మన మనసులో ప్రతిక్షణం ఒకప్పటి చిన్నపిల్లవాడు లేదా చిన్నపిల్ల వానాకాలపు వాకిట్లో సాగిపోతున్న పిల్లకాలువ వెంట తన కాగితప్పవడవతోపాటు పరుగులు పెడుతుంటాడు. ఆ పరుగుకు ఎన్నడూ వయసు మళ్ళదు. ఆ పరుగుకు పల్లవైన కాగితప్పడవకు కూడా మన జ్ఞాపకాల్లో ఎన్నటికీ వయసు మళ్ళదు. మళ్ళీ మళ్ళీ చిన్నతనంలోకి మనల్ని విసిరేసే కాగితప్పడవ ఇవాళ కూడా బాల్యాన్ని మనకు అందించేందుకు సిద్ధంగానే ఉంటుంది. అలాంటి కాగితప్పడవలో..., మనతోపాటు ఇదిగో ఇక్కడ ఇద్దరు గొప్ప కవులు కూడా ఇలా తమ కవితాఝరిలో లాహిరి, లాహిరి.... అంటున్నారు...

కాగితప్పడవలు



పారే సెలయేటిలో నేను ప్రతిరోజూ ఒక కాగితప్పడవను విడిచి పెడుతున్నాను.
వాటి మీద పెద్దపెద్ద నల్లటి అక్షరాలతో నా పేరును, నా గ్రామం పేరును రాశాను.
ఎక్కడో ఒక స్వాప్నిక తీరంలో నా పడవల్ని స్వీకరించిన వారు నేనెవరో తెలుసుకుంటారన్నదే నా ఆశ.
నా పడవల్ని మా తోటలోని పువ్వులతో నింపే వాడిని.
ఈ పువ్వులే నా పడవకు రాత్రివేళలో దారిదీపాలు కావాలని కోరుకున్నాను.
నేను నా కాగితప్పడవల్ని నీటిలో వదిలిపెట్టి,
ఆకాశంలో చిన్న చిన్న మబ్బు తునకలకేసి చూస్తాను. తెల్లని మూడు దీపాల్ని అవి కూడా చూడాలని..
ఆకాశంలోని నా చెలికాడు నా పడవలతో పోటీ పడేందుకు గాలిని పంపుతాడేమో నాకు తెలీదు
రాత్రి కాగానే నేను నా ముఖాన్ని చేతులతో కప్పుకుని, చుక్కల నీడలో ప్రయాణిస్తున్న నా కాగితప్పడవల గురించి కలగంటాను.
నిద్రదేవతలు నా పడవలో విహరిస్తూ ఉంటారు.
వారు తమ సజ్జల నిండా కలల్ని నింపుకుంటారు.

- రవీంద్రనాథ్ ఠాగూర్

సందేశం..



నువ్వు చిన్నపిల్లవాడిగా
ఉన్నప్పుడు ఒక
కాగితప్పడవను చేసుకుని,
దానితో పాటు నది గట్టు మీద
పరుగెట్టే వాడివి. నదిలో అలల మీద నీ పడవ
నెమ్మదిగా ఊగుతూ, కడలి వైపుగా సాగి పోయేది
'అది పెద్ద పెద్ద నౌకాశ్రయాల దగ్గర ఆగుతుంది' అని ఆ వృద్ధుడు నీతో చెప్పినప్పుడు, నువ్వు ఆనందంతో ఉబ్బితబ్బియి, ఇంటికి వెళ్ళే వాడివి. బుర్రనిండా రంగురంగుల కలలు నిండిపోయేవి. ఇక అప్పటి నుంచి నీ పడవ గురించిన కబురేదైనా వస్తుందేమోనని నువ్వు ఆతృతగా ఎదురు చూసేవాడివి. ఆ కాగితప్పడవ నీ మనసంతా నిండి ఉండేది.
తరువాత కొన్ని రోజులకు ఆ వృద్ధుని నుంచి నీకొక సందేశం వచ్చింది.
'ఒక పెద్ద వరదలో నేను నీ పడవనే వాడుకున్నాను.
అది ఇప్పుడు ఇక్కడే ఎక్కడో ఒక కొండ మీద ఉంది'
ఆ వృద్ధుడెవరో కాదు, నోవా (బైబిల్ పాత్ర)....

- సపర్ది జోకో డమోనో, ఇండొనీషియన్ కవి

కరెన్సీ కథ

రూపాయీ..రూపాయీ..



మనిషి జీవితాన్ని శాసిస్తున్న డబ్బు ఉరఫ్ కరెన్సీ నోటును చరిత్రలో మొట్టమొదట సృష్టించింది ఏడవశతాబ్దానికి చెందిన చైనా రాజవంశం 'టాంగ్'. అయితే ఇది పదకొండో శతాబ్దం వరకు తుదిరూపం తీసుకోలేదు. చైనా రాజవంశం శాంగ్ కరెన్సీనోటుకు ప్రాచుర్యం కల్పించింది. మంగోలుల సామ్రాజ్య స్థాపన తరువాత కరెన్సీ నోటు ప్రపంచమంతటా అల్లుకుపోయింది. అయితే మనదేశంలో 18 వ శతాబ్దం వరకు వెండి, బంగారు నాణేల్ని మాత్రమే మారక నగదుగా వినియోగించే వారు. తరువాత దేశంలో యురోపియన్ వాణిజ్య సంస్థలు కోల్‌కతాలో బ్యాంక్ ఆఫ్ హిందోస్తాన్ వంటి పలు ప్రత్యేక బ్యాంకుల్ని నెలకొల్పి ఇవాళ మనం ఉపయోగిస్తున్న కాగితపు కరెన్సీకి నాంది పలికాయి. అయితే ఆనాటి కరెన్సీ నోట్ల మీద ఎలాంటి చిత్రాలు ఉండేవి కావు. బెంగాల్, బొంబాయి, మద్రాసు వంటి కీలక నగరాలపై పట్టు సాధించిన బ్రిటిష్ కంపెనీలు బ్యాంక్ ఆఫ్ బెంగాల్‌ను స్థాపించడం ద్వారా పటిష్టమైన నగదు వ్యవస్థకు శ్రీకారం చుట్టాయి. దీంతో కరెన్సీ నోట్ల వినియోగం జనబాహుళ్యంలోకి చొచ్చుకు వెళ్ళింది. కాగా, 'పేపర్ కరెన్సీ యాక్ట్ 1861' అమల్లోకి వచ్చిన తరువాత బ్రిటిష్ వలస ప్రభుత్వం మనదేశంలో కరెన్సీనోట్ల ముద్రణను మొదలు పెట్టింది. ఈ చట్టానికి రూపకర్త జేమ్స్ విల్సన్. దేశంలో అధికారికంగా 'విక్టోరియా పోర్ట్రైట్ సిరీస్' పేరిట 10, 20, 50, 100, 1000 రూపాయల నోట్లను విడుదల చేశారు.


అయితే భారతదేశంలో మన 'రూపాయి' పుట్టుకకు మరో చారిత్రక ఆధారం కూడా ఉంది. 'రుపీ' అనే ఆంగ్ల పదానికి మూలం సంస్కృత పదమైన 'రుపకం'లో ఉంది. రుపకం అంటే వెండినాణెం అని అర్థం. ఉత్తర భారతదేశాన్ని పరిపాలించిన సుర్ రాజవంశానికి చెందిన షేర్ షా సురి (1540 - 45) రుపియా పేరిట మొట్టమొదటి రూపాయిని విడుదల చేశారు. అప్పటి నుంచి రూపాయి రకరకాల మార్పు, చేర్పులకు లోనై నేటి రూపాన్ని సంతరించుకుంది. దేశంలో 1, ఏప్రిల్, 1935న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించిన తరువాత బ్రిటిష్ కాలం నాటి రూపాయి నోటును రద్దు చేస్తూ, జనవరి, 1938న మొదటి ఐదురూపాయల నోటును ప్రవేశ పెట్టారు. ఫిబ్రవరి, జూన్ 1938 నాటికి పది, వంద, వెయ్యి, పదివేల రూపాయల నోట్లను విడుదల చేశారు. అయితే ఆగస్టు 1940న ఒక్క రూపాయి నోటును మళ్ళీ విడుదల చేశారు, మార్చి 1943న రెండు రూపాయల నోటును విడుదల చేశారు. అక్టోబర్ 1987న 500 రూపాయల నోటును విడుదల చేశారు. మహాత్మాగాంధీ ముఖచిత్రంతో 1996లో పది, ఐదువందల రూపాయల నోట్లని విడుదల చేశారు. జులై, 2010లో ఉదయ్ కుమార్ ధర్మలింగం భారతీయ కరెన్సీకి చిహ్నాన్ని తయారు చేయగా, ఇది అధికారిక నగదు చిహ్నంగా ఆమోదం పొందింది.

శిల్పం

కాగితమంటే అనుసంధానం!

- శిల్పి మనోహర్ చిలువేరు





సామాజిక సందర్భాల్ని, మానవ జీవిత సంఘర్షణను దార్శనిక కోణంలో వ్యక్తీకరించడానికి శిల్పాన్ని ఒక మాధ్యమంగా ఎంచుకున్నానంటారు హైదరాబాద్‌కు చెందిన శిల్పి, చిత్రకారుడు మనోహర్ చిలువేరు. శిల్పం ద్వారా తన భావాల్ని వ్యక్తం చేయడానికి మనోహర్ ఎంచుకునే మార్గం ఎంత విలక్షణంగా ఉంటుందో, శిల్పాల్ని తయారు చేయడానికి ఆయన ఎంచుకునే మీడియం కూడా అంతే విలక్షణంగా ఉంటుంది. కాగితపు గుజ్జు, సిల్వర్ ఫాయిల్ లాంటి వస్తువుల్ని ఉపయోగించి ఆయన శిల్పాల్ని రూపొందిస్తారు. మనోహర్ శిల్పి మాత్రమే కాదు, చిత్రకారుడు కూడా. సమాజమే ఆయన కాన్వాస్, శిల్పానికి కూడా అదే ప్రధాన వస్తువు. దైనందిన మానవ జీవితంలోని అతి సున్నితమైన అంశాల్ని ఆయన తన అభివ్యక్తి కోసం ప్రధాన వస్తువుగా తీసుకుంటారు. చిన్నతనం నుంచి తనలోని స్వాప్నికుణ్ణి నిత్యనూతనంగా ఆవిష్కరించడమే కళాకారునిగా తన ఉద్దేశమంటారాయన. మనోహర్ తెలంగాణలోని వరంగల్‌లో జన్మించారు. దేశవిదేశాల్లో తన కళాఖండాల్ని ప్రదర్శించారు. దేహంలో రక్తం ప్రవహించినట్టుగా సమాజంలో జ్ఞానం, సృజనాత్మకత ప్రవహించినపుడే సమాజం సజీవంగా ఉంటుందంటున్న అంతర్జాతీయ స్థాయి శిల్పి మనోహర్ చిలువేరుతో 'మైత్రి' సంభాషణ ఇలా సాగింది.

మైత్రి: మనోహర్ గారూ, కాగితపు గుజ్జు (పేపర్ పల్ప్)ని మీడియంగా ఎంచుకోవడానికి కారణం ఏదైనా ఉందా?

మనోహర్ చిలువేరు: కాగితపు గుజ్జుతో శిల్పాల్ని చేయడానికి ప్రత్యేక కారణమంటూ లేదు. నిజానికి నేను అనేక వస్తువుల్ని నా మీడియంగా ఎంచుకుంటాను. అందరూ కాగితపు గుజ్జుతో మూసల్ని తయారు చేస్తారు. నేను మాత్రం కాగితపు గుజ్జుతో శిల్పాన్ని తయారు చేస్తాను. ప్రధానంగా కాగితపుగుజ్జు చాలా సులభతరమైన మీడియం. వార్తలు లేని రోజు మన జీవితంలో ఉండదు. వార్తలంటే పలు భిన్నమైన అంశాలకు సంబంధించినవి. సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలన్నింటినీ అనుసంధానం చేసేవి వార్తలే కదా. అలాంటి వార్తలకు వేదికలైన కాగితాల్ని మీడియంగా స్వీకరించినపుడు నేను ఆయా సామాజిక విషయాల మధ్య ఉన్న అనుసంధానాన్ని చూస్తాను. ఇప్పటికీ మన రాష్ట్రంలో కమ్యూనిటీ స్టూడియోలు లేవు. కళాకారులు స్వంతంగా స్టూడియోల్ని నెలకొల్పుకోవాలి. నేను అపార్ట్‌మెంట్‌లో ఉంటాను. శిల్పాల్ని తయారు చేయాలంటే చాలా పెద్ద యంత్రాంగం, వాతావరణం అవసరం. అపార్ట్‌మెంట్‌లో అవన్నీ చేయలేం. కానీ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ కూడా కాగితపు గుజ్జుతో అయితే సులభంగా శిల్పాల్ని రూపొందించవచ్చు. నా అవసరాన్ని బట్టి నేను ఈ మీడియంను ఎంచుకున్నాను.

మైత్రి: మీ శిల్పాల్లో ప్రధానంగా మానవాకృతి, తలలు వంటివి కనిపిస్తాయి. దీని గురించి వివరిస్తారా?

మనోహర్ చిలువేరు: ప్రతి శిల్పంలో ప్రపంచానికి సంబంధించిన దృక్కోణం ఉంటుంది. దాన్ని వ్యక్తీకరించడానికి నేను ఇలా మానవాకృతిని, తలల్ని ఎంచుకుంటాను. నేను చెప్పదలచుకున్న విషయానికి వాటిని సంకేతాలుగా ఉపయోగిస్తాను. సామాజిక పరమైన అంశాల్నే నేను నా శిల్పాల ద్వారా చెబుతుంటాను కానీ, రాజకీయ సందేశాల్ని ఇవ్వను. ఒకరకంగా ఇదంతా నన్ను నేను అన్వేషించుకునే ప్రయత్నమే. ఒక ఆత్మాన్వేషణ అని చెప్పవచ్చు.

మైత్రి: ఒక ఆవు శిల్పం మీద వార్తాపత్రికల్ని అతికించారు, దీని అర్థం ఏమిటి?

మనోహర్ చిలువేరు: నేను ఆ ఆవు శిల్పం మీద ఉద్దేశపూర్వకంగానే వార్తాపత్రికల్ని అతికించాను. ఎందుకంటే పాలు లేకుండా మనకు రోజు మొదలవదు. ఆవుకు పవిత్రతను ఆపాదించే మతపరమైన నమ్మకాల్ని పక్కనబెడితే, ఆవుతో మన జీవితానికి విడదీయరాని సంబంధం ఉంది. అదొక ప్రాథమికమైన సంబంధం. ఆ సంబంధాన్ని చెప్పడానికే నేను వార్తాపత్రికల్ని అతికించాను. వార్తాపత్రికలంటే సామాజిక సందర్భానికి సంకేతమన్నమాట.

మైత్రి: ఇన్‌స్టలేషన్ ఆర్ట్ గురించి వివరిస్తారా?

మనోహర్ చిలువేరు: ఇన్‌స్టలేషన్ ఆర్ట్ అంటే చాలా రకాలున్నాయి. ఏదైనా ఒక వ్యాఖ్యానాన్ని చెప్పదలచుకున్నపుడు ఒక్క శిల్పంతో చెప్పడం అంతగా సాధ్యపడక పోవచ్చు. పలు శిల్పాల సమీకరణ ద్వారా మనం సామాజిక వ్యవస్థ మీద వ్యాఖ్యానాన్ని ప్రతిఫలింపజేయవచ్చు. ఒక శిల్పం లేదా చిత్రాన్ని తీసుకుంటే ఏదో ఒక్క విషయాన్ని మాత్రమే చెప్పగలం. ఇన్‌స్టలేషన్‌లో అలా కాదు. విస్తృతమైన అర్థాన్ని చెప్పడానికి ఇది మంచి మార్గమవుతుంది. ఇన్‌స్టలేషన్‌లో మనం పలు భిన్నమైన ఎలిమెంట్స్‌ని వాడుతాం.

మైత్రి: మీ శిల్పాలకు ప్రేరణ ఏమిటి?

మనోహర్ చిలువేరు: ప్రేరణ అంటూ మొదట్లో పెద్దగా ఉండేది కాదు. నన్ను నేను తెలుసుకునే ప్రయత్నంలో సీనియర్ల కళాశైలిని గమనించే వాడిని. కానీ వరంగల్‌లో పుట్టడం వల్లనేమో, చిన్నప్పటి నుంచి నేను కాకతీయ శిల్పశైలిని గమనిస్తూ ఉండే వాడిని. అది నాకు చాలా ఆసక్తికరంగా కనిపించేది. తోటవైకుంఠం, లక్ష్మాగౌడ్ వంటి సీనియర్ చిత్రకారుల శైలిని గమనించినప్పటికీ, ఆర్ట్ విద్యార్థిగా నేను కాకతీయ శిల్ప కళాశైలి ప్రభావం నుంచి బయటపడలేక పోయాను. అందుకేనేమో నేను శిల్పాన్నే నా అభిమాన విషయంగా ఎంచుకున్నాను.

మైత్రి: మీరు అతిభారీ (లైఫ్ సైజ్) శిల్పాలను కూడా చేశారు కదా, శిల్ప పరిమాణం ఏదైనా సందేశాన్నిస్తుందా?

మనోహర్ చిలువేరు: భారీ శిల్పం భావవ్యక్తీకరణకు సాధనంగా ఉంటుంది. చూసే వాళ్ళకు అదొక ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. చిన్న చిన్న శిల్పాలు, చిత్రాల ద్వారా అందమైన విషయాన్ని కూలంకషంగా చెప్పవచ్చునేమో కానీ, ఒక పెద్ద శిల్పం ద్వారా సంక్లిష్టమైన విషయాన్ని కూడా సులభంగా చెప్పవచ్చు.

మైత్రి: మీరు ఇంతవరకు చేసిన ఆర్ట్ సిరీస్ గురించి కాస్త వివరిస్తారా?

మనోహర్ చిలువేరు: నేను ఇదివరకు ఆవు ప్రధాన వస్తువుగా ఒక సిరీస్ చేశాను. దాన్ని సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రదర్శించాను. నాకు గ్యాలరీల్లో ప్రదర్శనలు నిర్వహించడం అంతగా నప్పదు. పర్యావరణం మీద కూడా నేను ఒక ప్రదర్శన చేశాను. అలాగే 'ఎమోర్' (ప్రేమ) పేరిట ఒక సిరీస్ చేశాను. పాజిబుల్ ఎఫెక్ట్స్ పేరిట కూడా మరో సిరీస్ చేశాను. ప్రస్తుతం ఒడిస్సీ అనే ప్రాజెక్ట్ చేస్తున్నాను. దీన్ని క్రియా యాక్ట్ అని కూడా పిలుస్తాను. ఆర్టిస్టుకి, ఆర్టిస్టు కాని వ్యక్తికి మధ్య ఉన్న అగాథాన్ని పూడ్చడానికి ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇది మూడు సంవత్సరాల ప్రాజెక్ట్.

మైత్రి: మీ పెయింటింగ్స్ గురించి చెప్పండి, స్ట్రోక్స్, కలర్ స్కీమ్ గురించి కొంచెం వివరించండి.

మనోహర్ చిలువేరు: నేను మొదట్లో ముదురు రంగుల్నే వాడే వాడిని. తరువాత కాంతిమంతమైన రంగుల్ని వాడడం మొదలు పెట్టాను. అంతేకాక నేను ఫోటోగ్రఫీ చేసి, డిజిటల్ చిత్రాల్ని కూడా రూపొందిస్తుంటాను.

మైత్రి: శిల్పిగా, చిత్రకారునిగా మీ ప్రస్థానాన్ని తెలుసుకోవచ్చా?

మనోహర్ చిలువేరు: పది, మొదటి నుంచీ నాకు శిల్పం అంటేనే ప్రత్యేకాభిమానం ఉండేది. వరంగల్‌లో ఉన్నప్పుడే నేనొక స్వాప్నికుణ్ణి. ఏదో చేయాలన్న ఆతృత ఉంటుంది. అందుకే గ్యాలరీలపై ఆధారపడడం, వారు నిర్దేశించిన శైలిలో కళాకృతుల్ని సృష్టించడం వంటివి నాకు సరిపడలేదు. నేను స్వయంగా ప్రాజెక్ట్‌ల్ని నిర్ణయించుకుని పని చేస్తాను. నేను లండన్, స్పెయిన్, యూరోప్‌లలో పర్యటించాను. లండన్‌లో నా పెయింటింగ్‌లు అమ్ముడయ్యాయి. కానీ ఇక అదే లోకంగా గడపలేక పోయాను. కొత్తకొత్త విషయాల్ని ఆవిష్కరించే ప్రయత్నంలో భాగంగా నాకు ఇలా ప్రాజెక్ట్‌ల మీద పనిచేయడమే సంతోషంగా ఉంటుంది. ఇప్పుడు నేను '24 సిటీస్' అనే కొత్త ప్రాజెక్ట్ చేస్తున్నాను. మన నగరంలో గ్యాలరీ కల్చర్ కూడా సరిగా లేదు. ఒక తగిన ఆర్టిస్టును ఎంచుకోవడం, అతనికి అన్నుదన్నుగా నిలబడడం వంటివి లేవు.

మైత్రి : డెకొరేటివ్ ఆర్ట్ (అలంకారం)కు, సమకాలీన కళకు ఉన్న తేడా ఏమిటి, ఇవాళ భారతీయ ఆర్ట్ మార్కెట్‌ని ఏ ప్రమాణాలు శాసిస్తున్నాయని మీరు భావిస్తున్నారు?

మనోహర్ చిలువేరు: ఆర్టిస్టు తన అభిరుచి మేరకు శైలిని ఎంచుకుంటాడు. ఎవరి పరిమితులు వాళ్ళకుంటాయి. అదే యురోపియన్ సంస్కృతిలో అయితే ప్రతి కళాకారునికి ఒక సామాజిక మద్దతు ఉంటుంది. అక్కడ కళాకారునికి అండదండలు సులభంగా లభిస్తాయి. ఆర్టిస్టు కూడా రైతులాంటి వాడే. మార్కెట్ ట్రెండ్‌ను బట్టి తన పనితీరును, శైలిని మార్చుకోవలసి వస్తోంది. ఒకేశైలిలో వందల కళాఖండాల్ని సృష్టించడం మొదలు పెట్టిన తరువాత కళ కాస్త క్రాఫ్ట్ (చేతివృత్తి)గా మారిపోతుంది. సమకాలీన చిత్రకళలో కాన్సెప్ట్ ప్రతిఫలిస్తుంది. భారతీ య చిత్రకళకు అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా ఎక్స్‌పోజర్ లేదు. అంతర్జాతీయంగా కళాఖండాల వేలం సంస్థలు మునుపు యురోపియన్ దేశాలకే ఎక్కువగా ప్రాధాన్యాన్ని ఇచ్చేవి. అయితే క్రమేణా వ్యాపార లక్ష్యాల్ని సాధించే ఉద్దేశంతో ఇప్పుడవి కూడా ఇతర దేశాల కళాకారుల వైపు చూస్తున్నాయి. ఈ నేపథ్యం లో భారతీయ చిత్రకళకు కొంత ప్రాచుర్యం ఏర్పడిందని చెప్పాలి.

- ఇంటర్వ్యూ: పసుపులేటి గీత

నేల మీది ఆకాశం!

మాటలు పెంపుడు పక్షుల్లాంటివి, వాటిని పెదవుల పంజరంలో బంధించనక్కర్లేదు, 'కాగితమనే' ఆకాశంలోకి విడిచి పెడితే చాలు, రెండు రెక్కలతో ఎగిరెళ్ళి, వందలాది అనుభూతుల చినుకులై మనసును తడిపేస్తాయి. తెల్లటి కాగితం కన్నా మంచి కథకుడు ఉండడు. జీవితంలో కాగితంతో పని లేకుండా మనకు ఒక్క రోజైనా గడుస్తుందా? కాగితంతో మనిషి సహవాసం ఈనాటిది కాదు, క్రీస్తుపూర్వం 22వ శతాబ్దం నుంచే ప్రాచీన చైనీయులు ప్రపంచానికి ఈ నేస్తాన్ని అందించిన విషయం విదితమే. కన్ను తెరిచిన తొలిక్షణం నుంచి బర్త్ సర్టిఫికేట్‌తో మొదలయ్యే ఈ స్నేహం కన్నుమూసే వరకు, అటు తరువాత కూడా డెత్ సర్టిఫికేట్ అంటూ కొనసాగుతుంది. అంతెందుకు, రేయింబవళ్ళు ఊరించి, భయపెట్టి, నానారకాలుగా మనిషిని బాధించే కరెన్సీనోటు రూపంలో ఈ ప్రియశత్రువు ప్రతిక్షణం మనమీద రాజ్యం చేస్తూనే ఉన్న వాస్తవాన్ని కాదనలేం కదా! కాగితం ఎంత మంచి స్నేహితుడో, కరెన్సీ అంత మంచి శత్రువు. అందుకే ఇవాల్టి 'మైత్రి' కొన్ని కాగితపు కబుర్లతో మిమ్మల్ని పలకరిస్తోంది.

- మీ 'మైత్రి'

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

శనివారం, ఫిబ్రవరి 3


తీరుమార్చుకున్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిలో గతానికి, ప్రస్తుతానికి ఎంతో మార్పు కనిపిస్తోంది. బుధవారం ఆయన అమెరికన్ కాంగ్రెస్ (పార్లమెంట్ ఉభయసభల నుద్దేశించి)లో చేసిన ప్రసంగాన్ని పరిశీలిస్తే పార్లమెంట్ సభ్యులందర్నీ ఆయన ఆయోమయంలో పడేశారని చెప్పుకోవచ్చు. ఆయన మరిన్ని కఠిన నిర్ణయాలతో ప్రసంగిస్తారని, దాంతో మరిన్ని వివాదాలు తలెత్తుతాయని వారు భావించిన దానికి భిన్నంగా ప్రసంగించడం విస్మయానికి గురిచేసింది. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా తాను సాధించిన చిన్నచిన్న విజయాలను ఘనవిజయాలుగా అభివర్ణించుకున్నారు. సామాజిక మీడియాల్లో సహజంగా రెచ్చగొట్టేలా కనిపించే ట్రంప్ బుధవారం నాటి స్టేట్ ఆఫ్ యూనియన్ స్పీచ్‌లో పూర్తి వ్యతిరేకంగా కనిపించారు. ముందుగా రూపొందించిన ప్రసంగానికి మాత్రమే పరిమితం కావడం పార్లమెంట్ సభ్యులను ఆశ్చర్యంలో ముంచెత్తించింది. వలసవాదంపై ఫెడరల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై డెమొక్రాట్ల వైఖరిని ట్విటర్‌లో దుయ్యబట్టిన ఆయన, ఇప్పుడు విధాన నిర్ణయాల రూపకల్పనలో ఐక్యతా రాగం వినిపించడం విశేషం. 'నూతన అమెరికా క్షణాల'ను తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. తన ఏడాది విజయాలపై తనను తను అభినందించుకోవడంలో ఆయన వెనుకాడలేదు. బిడియపడలేదు. వలస విధానంలో చేపట్టిన వలసవాద సంస్కరణలతో భవిష్యత్ వలసవాదులకు ఏ ఇబ్బందులుండవని ఆయన అభయమిచ్చారు. తాను రూపొందించనున్న నూతన వలసవాద చట్టం గురించి ప్రస్తావిస్తూ, నాలుగు దశలను ప్రతిపాదించారు. బాల్యంలో తల్లిదండ్రులతో వచ్చినవారికి సంబంధించి లాటరీ వీసా విధానాన్ని మారుస్తున్నామని ప్రకటించారు. కుటుంబ ప్రాతిపదికన వలసలకు పరిమితి, సరిహద్దుల్లో భద్రతావసరాల మేరకు వీసా విధానం సంస్కరణలుంటాయని ఆయన తెలిపారు. ప్రతిభ ఆధారంగా వలస విధానం మార్పు చేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టంచేశారు.

ట్రంప్ ప్రసంగం ఆసాంతం వలసవాదులపై కనిపించని విసుర్లున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికన్లు కూడా స్వాప్నికులు అని ప్రకటించడం కూడా విమర్శలకు దారితీస్తోంది. ఈ ప్రకటన ద్వారా ఆయన కేవలం అమెరికన్లకు మాత్రమే సాయపడతానని చెప్పకుండానే చెప్పినట్లుగా ఉందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఉత్తర కొరియా, సిరియా, ఉక్రెయిన్ దేశాల అంశంలోనూ, టెర్రరిజంపై రష్యా, చైనా అనుసరిస్తున్న వైఖరులను గత కొంతకాలంగా ట్విటర్లలో తప్పుపడుతూ విరుచుకుపడిన ట్రంప్, తన వైఖరికి పూర్తి భిన్నంగా స్పందించడం గమనార్హం. ట్రంప్ ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ అనేకమంది అమెరికన్లు వ్యంగ్య వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ట్రంప్ ప్రసంగం గురించి హాస్యనటుడు స్టీఫెన్ కాల్‌బర్ట్ మాట్లాడుతూ, 'మా ఎదురుగా పర్వతం ఉంటే ఎక్కుతాం, మా ఎదుట బర్గర్ ఉంటే తినేస్తాం, దర్యాప్తు ఉంటే అడ్డుకుంటాం' అన్నట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి కేవలం అమెరికన్ల కోసమే ట్రంప్ కృషిచేస్తారని స్పష్టమవుతోంది.

ఏదేమైనా అత్యంత క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న ట్రంప్ కొంతమేరకు తగ్గక తప్పని స్థితి ఏర్పడిందని భావించవచ్చు. ఆయన విధానాలతో విసుగెత్తిన అమెరికన్లలో 40 శాతం మాత్రమే ఆయన్ని సమర్థిస్తున్నారని అనేక సర్వేల్లో వెల్లడైంది. అదే ఆయనలోని మార్పునకు కారణంగా చెప్పుకోవచ్చు. అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిడులు కావచ్చు. ఉత్తర కొరియాపై ట్రంప్ కొంతమేరకు తగ్గినట్లు భావించవచ్చు. గతంలో తనకెదురులేనట్టు కొంతమేర తలబిరుసుతో వ్యవహరించిన ట్రంప్, నేడు అన్ని విధానాల్లోనూ సంయమనం పాటించాలని తలచినట్టుగా ప్రసంగ మాటలు స్పష్టంచేస్తున్నాయి. పన్నుల తగ్గించామని ప్రకటించడాన్ని కూడా అమెరికన్లు తప్పుపడుతున్నారు. అది పూర్తిగా అసత్యమని చెబుతున్నారు. ఇప్పటివరకు పనిచేసిన అధ్యక్షుల్లో ప్రతిష్ఠ దిగజారిపోయేలా వ్యాఖ్యలు చేసిన తొలివ్యక్తి ట్రంపేనని అమెరికన్లలో అత్యధికులు భావిస్తున్నారు. అమెరికాలోని అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేయాలనే ఆలోచనతో ఈ ఏడాదిలో ఆయన ప్యారిస్ ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్టు చేసిన ప్రకటన సహా పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. అమెరికా అనేది కేవలం అమెరికన్ల కోసమే అన్నట్టుగా ఆయన వ్యవహరించారు. నిన్నటి ప్రసంగం ద్వారా కొత్త బ్రాండ్ ముద్ర వేయించుకునేందుకు ఆయన చేసిన ప్రయత్నం ఎంతకాలం ఆయన్నిలా నిలువరిస్తుందో కాలమే చెబుతుంది.

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com



మంచిమాట



కుదిరితే పరిగెత్తు,
లేకపోతే నడువు,
అదీకాకపోతే
పాకుతూ పో,
అంతేగానీ ఒకేచోట
కదలకుండా
ఉండిపోకు

- మహాకవి శ్రీశ్రీ

బడ్జెట్...లాభమెంత? నష్టమెంత?



జి. రాజశుక

సచేతన

కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్థిక నిపుణుల నుంచి సామాన్య ప్రజానీకం వరకూ అందరినీ మళ్లీ అయోమయంలో పడేసింది. ఈ బడ్జెట్ అంతరార్థమేమిటో ప్రతిపక్షాలకు కూడా అంతుబట్టడం లేదు. బడ్జెట్ షాక్ నుంచి తెలుగు రాష్ట్రాలు ఇంకా కోలుకోలేదు. బడ్జెట్‌తో ఏ రంగానికి లాభం కలిగింది? ఏ రంగం నష్టపోయింది? దీన్ని ఆర్థికవేత్తలు ఇంకా మదింపు చేస్తూనే ఉన్నారు. అయితే, ఈ బడ్జెట్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఆశిస్తున్నదేమిటి? ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే ఆయన నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఏ విధంగా లాభపడబోతోంది? ఆర్థిక నిపుణుల అభిప్రాయాలను అటుంచి రాజకీయ విశ్లేషకుల స్పందన ఏమిటి? వారి అభిప్రాయమేమిటి?

నిజానికి నరేంద్ర మోదీ-అమిత్ షాల ద్వయం ఎప్పుడు ఏవిధంగా వ్యూహం పన్నుతారనేది కూడా అంతుబట్టని విషయమే. అయితే, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఈ ద్వయం ప్రతి అంశాన్నీ, ప్రతి విషయాన్నీ తమ రాజకీయ అస్త్రంగానే ఉపయోగించుకుంటుంది. అదే పద్ధతిలో బడ్జెట్‌ను కూడా మోదీ ఓ బ్రహ్మాస్త్రంగానే ఉపయోగించుకున్నారు. ఈ బడ్జెట్‌తో మోదీ ప్రతిపక్షాల మీదా, ప్రత్యర్థుల మీదా మానసిక పోరాటానికి తెర తీశారు. మూడో వ్యక్తికి తెలియకుండా (వినిపించకుండా) ఎన్నికల శంఖారావం పూరించారు! రానున్న లోక్‌సభ ఎన్నికలకు ఆయన వ్యూహ రచన ప్రారంభమైంది. ప్రతిపక్షాలను బలహీనపరచడానికి ఆయన ఎత్తులు వేయడం ప్రారంభించారు. అందుకు నాందీ ప్రస్తావనే ఈ బడ్జెట్!

ప్రభుత్వం ఎక్కడ పొరపాట్లు చేస్తుందా, ఏ విధంగా తప్పటడుగులు వేస్తుందా అని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ వేయి కళ్లతో ఎదురుచూస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఏ చిన్న తప్పుచేసినా దాన్ని రాజకీయ అస్త్రంగా మలుచుకుందామని పాలక పక్షాన్ని కాంగ్రెస్ అనేక విధాలుగా రెచ్చగొడుతోంది. మోదీ ప్రభుత్వానికి ఈ సంగతి బాగా తెలుసు. అరుణ్ జైట్లీ తన సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగంలో ప్రతి అడుగూ ఆచితూచి వేశారు. సాధారణ ప్రజానీకంతో మమేకమయ్యేటట్టు, పేదలు, మధ్యతరగతిని సంతృప్తి పరిచేటట్టు ఆయన జాగ్రత్తలు తీసుకున్నారు. మేధావి వర్గాలు, ఆర్థిక నిపుణులను సంతృప్తి పరచడమనేది జరిగే పని కాదని ఆయన భావించి ఉండాలి. ఈ బడ్జెట్ ద్వారా అందరికీ అర్థమైన విషయమేమిటంటే. మోదీ ప్రభుత్వం కేవలం 2019ని మాత్రమే కాక, ఆ తరువాతి కాలాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని దీన్ని రూపొందించింది.



మొత్తం దేశాన్ని పట్టణీకరణ చేయాలనే సంకల్పంతో స్మార్ట్ సిటీల నిర్మాణానికి నడుం బిగించడం కూడా ఇదే ఉద్దేశంతోనే. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీల నిర్మాణానికి కూడా భారీగా నిధులు కేటాయించింది. కేంద్రం ఈ బడ్జెట్ ద్వారా పేదలు, గ్రామీణ ప్రజలు, దిగువ మధ్యతరగతిని ఆకట్టుకోవడానికి ప్రయత్నించింది. దేశ ప్రజలలో అరవై శాతానికి పైగా ప్రజలు ఈ వర్గానికి చెందినవారే కావడం గమనార్హం. దేశంలో తొమ్మిది రాష్ట్రాలకు ఈ ఏడాది, లోక్ సభ ఎన్నికలు వచ్చే ఏడాది మేలోగా జరగబోతున్న సమయంలో, కేంద్రం ఇటువంటి బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుందన్నది ముందుగా ఊహించిన విషయమే. ఆర్థిక నిపుణులు ఏ విధంగా ఆలోచిస్తున్నప్పటికీ, మంచి రాజకీయాలంటే మంచి ఆర్థిక విషయాలేనన్న సంగతి మోదీ ప్రభుత్వానికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు.

పథకాలతో ప్రయోగాలు

గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రభావం 2022 వరకూ ఉండే అవకాశం ఉంది. అంటే, 2019 ఎన్నికలలో విజయం సాధించడం నల్లేరు మీది నడక అని, అంటే ఈ ఎన్నికల్లో తాము గెలవడం ఖాయమని మోదీ ప్రభుత్వం భావిస్తోందన్న మాట. ఎన్నికలు జరగడానికి ఇంకా చాలా సమయం ఉన్నందువల్ల, అటువంటి నిర్ణయానికి రావడం సమంజసంగా కనిపించదు. పైగా రాజకీయాల్లో దేన్నీ ముందుగా ఊహించలేం. బహుశా అందుకే మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలను కలవరపెట్టడానికి, కంగారుపెట్టడానికి బడ్జెట్‌ను ఉపయోగించుకుంది. బడ్జెట్ మీద ప్రతిపక్షాల స్పందనలు, వ్యాఖ్యలు చూస్తుంటే మోదీ ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని సాధించడంలో కొద్దిగా ముందడుగు వేసినట్టే కనిపిస్తోంది.

జైట్లీ తన బడ్జెట్ ప్రసంగం సందర్భంగా గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించగానే ప్రభుత్వ లక్ష్యమేమిటో అర్థమైపోయింది. ఈ మధ్య కాలంలో జైట్లీ ఏనాడూ వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర గురించి ఎక్కడా మాట్లాడిన పాపాన పోలేదు. వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ వసతులు సృష్టించడం, మార్కెట్ చెయిన్స్‌కు అనుబంధం చేయడం ఏ బడ్జెట్‌లోనూ ప్రాధాన్య అంశం కాలేదు. అయినప్పటికీ జైట్లీ వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, రైతులకు మా ర్కెట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్టు ప్రకటించడం ఆ లోచించాల్సిన విషయం. వ్యవసాయోత్పత్తుల క్రయ విక్రయాలకు సంస్థాగత వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని, గోదాములను నిర్మిస్తామని ప్రకటించి ఆయన పల్లె ప్రజలను తమ వైపుకి తిప్పుకోగలిగారు.

ఇక సుమారు 55 శాతం మంది పేదలు, దిగువ మధ్య తరగతివారికి వర్తించే విధంగా జాతీయ ఆరోగ్య పథకాన్ని ప్రారంభించబోతున్నట్టు ప్రకటించారు. ఈ పథకాన్ని ప్రభుత్వం ఏ విధంగా అమలు చేయబోతోంది? ఈ పథకానికి నిధుల్ని ఎక్కడి నుంచి తెస్తుంది? జన్ ధన్, ఉజ్వల, ఉజాలా వంటి పథకాలు విజయవంతమైనట్టు ఈ పథకం కూడా విజయం సాధిస్తుందా అన్నది చూడాలి. అధికార యంత్రాంగం సహకరిస్తే ఏ పథకమైనా విజయం సాధిస్తుంది. నిధుల కొరత, డాక్టర్ల కొరత, ఆస్పత్రులలో సౌకర్యాల లేమి వగైరాల కారణంగా ఈ పథకం నత్తనడక నడవడానికే అవకాశం ఉంది. ఈ పథకం ఆచరణాత్మకంగా లేదని, ఏదో ఊహాగానాలు సాగించినంత మాత్రాన సరిపోదని ప్రతిపక్షాలు ఇప్పటికే విమర్శలకు దిగాయి. అయితే, ఈ పథకం మాత్రం ప్రతిపక్షాల అంచనాలకు భిన్నంగా సామాన్య ప్రజానీకాన్ని బాగా ఆకట్టుకునే అవకాశం ఉంది.

విజయ రహస్యాలు

నిజానికి ఇటీవలి వరకూ వంట గ్యాస్ సిలెండర్లు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, బ్యాంకింగ్ సౌకర్యాలు ప్రజలకు అందుబాటులో ఉండేవి కావు. ఇప్పుడు ఈ సౌకర్యాలను కలిగించడానికి దాదాపు ప్రతి రాష్ట్రమూ పోటీపడుతోంది. ఒకప్పుడు ఈ పథకాల అమలులో అనేక సమస్యలు ఎదురయ్యేవి. ఇప్పుడు ప్రజలు దీన్ని ఒక దానంగా కాక, తమ హక్కుగా భావించి ప్రభుత్వాల నుంచి రాబట్టుకుంటున్నారు. ఆరోగ్య పథకం వంటి ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వాలు ఎందుకు ఇంత సమయం తీసుకుంటున్నాయన్నదే ప్రశ్న. ప్రభుత్వం పథకాలను ప్రకటించి అమలు చేయడం ప్రారంభిస్తే ప్రజలే తమ హక్కుగా వాటి అమలుకు పోరాడుతుంటారు.

ఇక ఈ బడ్జెట్ గ్రామీణ గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చింది. పట్టణాలలోని ఎగువ మధ్య తరగతి కుటుంబాలతో గ్రామీణ మధ్యతరగతి పోటీ పడుతోందని, ఫలితంగా ఓ కొత్త మధ్య తరగతి ఉద్భవించిందని ప్రభుత్వానికి అర్థమైపోయింది. ఈ మధ్య తరగతిని తమ వైపు తిప్పుకోవాలని బీజేపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. మొత్తం దేశాన్ని పట్టణీకరణ చేయాలనే సంకల్పంతో స్మార్ట్ సిటీల నిర్మాణానికి నడుం బిగించడం కూడా ఇదే ఉద్దేశంతోనే. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీల నిర్మాణానికి కూడా భారీగా నిధులు కేటాయించింది. కేంద్రం ఈ బడ్జెట్ ద్వారా పేదలు, గ్రామీణ ప్రజలు, దిగువ మధ్యతరగతిని ఆకట్టుకోవడానికి ప్రయత్నించింది. దేశ ప్రజలలో అరవై శాతానికి పైగా ప్రజలు ఈ వర్గానికి చెందినవారే కావడం గమనార్హం.

దేశంలో తొమ్మిది రాష్ట్రాలకు ఈ ఏడాది, లోక్ సభ ఎన్నికలు వచ్చే ఏడాది మేలోగా జరగబోతున్న సమయంలో, కేంద్రం ఇటువంటి బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుందన్నది ముందుగా ఊహించిన విషయమే. ఆర్థిక నిపుణులు ఏ విధంగా ఆలోచిస్తున్నప్పటికీ, మంచి రాజకీయాలంటే మంచి ఆర్థిక విషయాలేనన్న సంగతి మోదీ ప్రభుత్వానికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా నరేంద్ర మోదీ ఇదే సిద్ధాంతంతో పాలన సాగించారు. మొత్తానికి ఈ బడ్జెట్ మోదీ తదుపరి వ్యూహం ఏమిటా అని ఆలోచించేట్టు చేసింది. అయితే, అది మాత్రం ఎప్పటికీ అంతుబట్టని విషయమే!

రైస్ మిల్లర్ల మాయాజాలం

పండించిన ధాన్యాన్ని రైతు సులువుగా అమ్ముకోవటం కోసం నిబంధనలను కొంతమేర సడలించిన అధికారులు బిల్లర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల అధిపతులు, దళారులు ప్రభుత్వ నిధులను బాహాటంగా బొక్కటానికి కూడా అవకాశం కల్పించారు. ప్రభుత్వ సొమ్ములు రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేసినప్పుడు మద్దతు ధరకన్నా తక్కువగా చెల్లించి రైతుల సొమ్మును తమ బొక్కసాల్లో నింపుకుంటున్న మిల్లర్లు ఈసారి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, దళారుల సాయంతో ఈ రాష్ట్రానికి తెచ్చి, ఇక్కడే కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపించి, ప్రభుత్వధనాన్ని తమ ఖాతాలకు మళ్ళించుకోవటం ఆనవాయితీగా మారింది. ధాన్యం కొనుగోలు విషయంలో అవకతవకలకు పాల్పడిన కారణంగా కృష్ణా జిల్లాలోని 15 రైసు మిల్లులపై కేసు నమోదు చేశారు. అలానే ధాన్యం కొనుగోలు బాధ్యతలు చేపట్టిన 9 వ్యవసాయ సహకార పరపతి సంఘాలపై కూడా చర్యలు చేపట్టారు. కృష్ణాజిల్లా సహాయ కలెక్టర్ మీడియా కథనాలు చూసి స్వయంగా రంగంలోకి దిగి మిల్లర్ల సహకార సంఘాల అవినీతి, అక్రమాలను గుర్తించి కేసులు నమోదుచేసి దర్యాప్తు కొన సాగిస్తున్నారు. కొందరు నాయకులు మిల్లర్ల చర్యలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వున్నాయి. కేంద్రం ప్రకటించిన మద్దతుధర సజావుగా రైతుకు అందాలంటే రవాణా ఇబ్బందులు లేకుండా ఉండాలంటే రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు వుండాలని ప్రభుత్వం అభిప్రాయపడింది. అందుకు అనువుగా ప్రతి రెండు, మూడు గ్రామాలకు ఒకటి చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాలలో వలే ధాన్యం కొనుగోలు చేయటానికి ఫుడ్ కార్పొరేషన్ తరపున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. సివిల్ సప్లయిస్ కేంద్రాలు ఒకప్పుడు కొన్నుండేవి. ఇప్పుడు అవి మూలపడ్డాయి. రైతులకు ఇబ్బంది కలిగించకూడదనే సదుద్దేశంతో గ్రామాలలో వున్న వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు, వెలుగు ఆధ్వర్యంలోని డ్వాక్రా సంఘాలకు ఎక్కువగా ధాన్యం కొనుగోలు అవకాశం కల్పించారు. కృష్ణాజిల్లాలో 330 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే వాటిలో 237 కేంద్రాలు సహకార పరపతి సంఘాలకు, 73 డ్వాక్రా సంఘాలకు కేటాయించారు. కేవలం 20 కేంద్రాలను డిసిఎంఎస్‌లు నిర్వహిస్తున్నాయి. స్థానికంగా వుండే కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్ళు జరగడం వల్ల రైతులకు కొంత మేర వెసులుబాటు వుంటుందన్న విషయం నిజం. అలాగే కొనుగోళ్ళ వల్ల ఆయా సంస్థలకు కొంత కమిషన్ లభించి, ఆ సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి.

గ్రామాన్ని యూనిట్‌గా చేసి కొనుగోళ్ళు సాగిస్తున్న విధానం కొందరికి నచ్చలేదు. జిల్లా మొత్తాన్ని ఒకే యూనిట్‌గా మార్చి రైతు పండించిన ధాన్యం జిల్లాలోని ఏ మారుమూల కేంద్రంలోనైనా అమ్ముకోవటానికి వీలు కల్పించే విధంగా సవరణలు ప్రతిపాదించి అవి అమలు జరిగే వరకు కొందరు పోరాటం కూడా జరిపారు. జనవరి మూడవ వారం నుంచి జిల్లాను యూనిట్‌గా మార్చి కొనుగోళ్ళకు తెరలేచింది. ఏ రైతు జిల్లాలో తనకు అందుబాటుగా వున్న ఏ కేంద్రంలో తను పండించిన ధాన్యం అమ్ముకోవాలన్నా రైతు పట్టాదారు పాస్ పుస్తకం, యస్ఇడి కార్డులు, విఆర్ఏల ధ్రువపత్రాలు ఆయా కేంద్రాలకు విధిగా తీసుకెళ్ళాలి. అవి లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు స్వీకరించటానికి వీల్లేదు. ఇలా చేయటం వల్ల రైతుకు రవాణా ఇబ్బంది కలిగించటం, కాలహరణ లాంటివి అనేకం వున్నాయి. రైతు శ్రేయస్సుకోసం శ్రమిస్తున్నామని చెప్పుకొనే మన నాయకులు రైతుల్ని మళ్ళీ ఎందుకు ఇబ్బందుల్లోకి నేడుతున్నారు? కొందరు వ్యక్తులు తనకు అనుకూలంగా వుండే కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోటానికి వీలుగా నిబంధనలు ఈ విధంగా సడలించారనే ప్రచారమూ వుంది. కొనుగోలు కేంద్రాలు కొన్న ధాన్యాన్ని అందుబాటులో వున్న రైస్‌మిల్లులకు అప్పగించాలి. ఆ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి మిల్లు వరకు తరలించినందుకు రవాణా చార్జీగా కొంత ప్రభుత్వం మిల్లర్లు చెల్లించాల్సి వుంటుంది.



తూర్పు గోదావరి జిల్లాలోని ఒక కేంద్రంలో 546 మంది రైతుల నుంచి అయిదు వేల క్వింటాళ్ళ ధాన్యం కొన్నట్లు లెక్కలు తయారు చేశారు. కొనుగోలు సరుకు కౌలూ వేయటానికి, ఆ ధాన్యంలోని తేమను పరిశీలించటానికి ప్రభుత్వం పంపిన సామాను సీళ్ళు కూడా విప్పలేదు. మరి ఆ కేంద్రం 5 వేల క్వింటాళ్ళ ధాన్యం ఎలా కొనుగోలు చేసింది? ఎలా తేమను పరిశీలించింది? ఎలా కౌలూ వేసింది.

ఇప్పుడు మరో రకం దోపిడీ మొదలైంది. ఇతర రాష్ట్రాలలో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి మన రాష్ట్రానికి తెప్పించి ఇక్కడ కొన్న ధాన్యంగా లెక్కలు రూపొందించి, మంచి ధర రాబట్టుకోవటానికి మిల్లర్లు సంఘటితమైన సంఘటనలు మొదలైనట్లు కొన్ని సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందిన ధాన్యం దళారుల సహకారంతో అక్కడ పండిన ధాన్యాన్ని లారీల ద్వారా ఇక్కడకు రప్పిస్తున్నారు. కొనుగోళ్ళ కేంద్రాల అధిపతులు, మిల్లర్లు కలిసి రాష్ట్ర ఖజానా నుంచి ఎక్కువ మొత్తాలను స్వాహా చేయటానికి కృష్ణాజిల్లా కేంద్రమైతే, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెప్పించే విషయంలో తూర్పు గోదావరి జిల్లా ముందుంది (ఇప్పటివరకు వెలుగు చూసిన సంఘటనల మేరకు). మేలు రకం ధాన్యం మద్దతు ధర క్వింటాలు సుమారుగా రూ.1500లు ఒడిశాలో ఇదే ధాన్యం రూ.800 నుంచి 1000లకు కొనుగోలు చేసి ఆ ధాన్యాన్ని ఇక్కడకు తెప్పించి, మిల్లింగ్ చేసి ఇక్కడి ప్రభుత్వానికి బియ్యం అప్పగించి ప్రభుత్వం నుంచి నిధులు దండుకుంటున్నారు. అసలు కొనుగోళ్ళు ప్రారంభించని స్థానిక కొనుగోళ్ళ కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యంగా ఇతర రాష్ట్రాలనుంచి తెప్పించిన ధాన్యం చూపించి, బియ్యం ప్రభుత్వానికి అంటగడుతున్నారు. కొనుగోళ్ళు జరపని కేంద్రాలలో వేల క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపించిన సంఘటనలు కొన్ని వెలుగులోకి వచ్చాయి. తూర్పు గోదావరి జిల్లాలోని ఒక కేంద్రంలో 546 మంది రైతుల నుంచి అయిదు వేల క్వింటాళ్ళ ధాన్యం కొన్నట్లు లెక్కలు తయారుచేశారు. కొనుగోలు సరుకు కౌలూ వేయటానికి, ఆ ధాన్యంలోని తేమను పరిశీలించటానికి ప్రభుత్వం పంపిన సామాను సీళ్ళు కూడా విప్పలేదు. మరి ఆ కేంద్రం 5 వేల క్వింటాళ్ళ ధాన్యం ఎలా కొనుగోలు చేసింది? ఎలా తేమను పరిశీలించింది? ఎలా కౌలూ వేసింది. ఇలాంటి సంఘటనలు గతంలో కృష్ణాజిల్లాలోను వెలుగుచూశాయి. ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా వెలుగులోకి వస్తున్నాయి. రైతులకు మాయమాటలు చెప్పి, ఏవేవో ఆశలు చూపి రైతుల ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాల నకళ్లు తీసుకొని, వాటి ఆధారంగా ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించిన ధాన్యానికి ఇక్కడి రైతుల వివరాలు పొందుపరచి, దొంగ లెక్కలు రూపొందిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. బిక్కవోలు (తూర్పు గోదావరి జిల్లా)కు చెందిన రైతు 208 క్వింటాళ్ళ ధాన్యం అమ్మినట్లు రికార్డుల్లో వుంది. ఆ రైతు అసలు వరి పంట సాగు చేయలేదని పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఒక మిల్లరు అడిగితే యిచ్చానంటున్నాడు. మరో రైతు తనకు అసలు పొలం లేదని, కౌలుదారు కార్డు యిప్పిస్తానంటే తనది, తన భార్యది ఆధార్ కార్డులు యిచ్చానని చెప్తున్నారు. అన్నదాతలను మోసగించి వారి కష్టార్జితాన్ని స్వాహాచేసే వారి చర్యలకు అడ్డుకట్ట ఎప్పుడు? ఎక్కడ? ఎలా?

◆ దాసరి ఆళ్వార స్వామి
9393818111

మన లేఖలు

అమ్మకి మంచి రోజులు

అమ్మ అవ్వటం ఒక వరం. అమ్మ నవమాసాలు మోసి, కని , పెంచి, ఎన్నో పురుటినొప్పులు పడి బిడ్డకు జన్మనిస్తుంది. ఎన్ని తప్పులు చేసినా పెద్ద మనసుతో క్షమిస్తుంది. తాను కడుపు మాడ్చుకొని బిడ్డ కడుపు నింపుతుంది. ఎండకి ఎండి బిడ్డకు నీడనిస్తుంది. అమ్మ ప్రేమకి వెలకట్టలేము. తాను ప్రేమకు ప్రతిరూపం. నిస్వార్థమైన ప్రేమకు చిహ్నం. పిల్లలకోసం తన జీవితాన్నే ధార పోస్తుంది. అమ్మని మించిన దైవం లేదు. అమ్మ గురించి చెప్పడానికి మాటలు సరిపోవు. అలాంటి అమ్మని కంటికి రెప్పలా కాపాడుకోవడం మన బాధ్యత. కానీ కొందరి తల్లులకు అమ్మ తనమే శాపం అనిపిస్తుంది. వృద్ధాప్యంలోకి వచ్చిన అమ్మలకి పిల్లలు అసరాగా ఉండాల్సింది పోయి, వాళ్ల పట్ల చాలా అమానుషంగా దారుణంగా ప్రవర్తిస్తున్నారు. వృద్ధాప్యంలో ఒక ముద్ద అన్నం పెట్టలేకపోతున్నారు. వాళ్ల కోసం సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. బరువుగా భావించి అనాథ శరణాలయంలో, వృద్ధాశ్రమంలో వదిలేస్తున్నారు... వదిలిం చుకుంటున్నారు అని అంటే బాగుంటుందేమో. వాళ్లు అక్కడ జీవచ్ఛవంలా బతుకుతున్నారు. ఈ కాలంలో అందరికీ విద్య అందుబాటులో ఉంటుంది. చదువు సంస్కారం పెరుగుతున్న ఈ రోజుల్లో మానవతా విలువలు పెరగాల్సింది పోయి తగ్గుతున్నాయి. దానివల్ల కాలం గడుస్తున్నకొద్దీ వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు పెరుగు తున్నాయి. చాలా బాధనిపిస్తోంది. ఈ తప్పు ఎవరి దంటారు? ఎవరిని నిందిస్తారు? పిల్లల్లో, పెద్దల్లో అనురాగ ఆప్యాయతలు, పెరగటానికి ప్రభుత్వం కూడా దానికి తగ్గట్టుగా కృషి చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. చిన్నప్పట్నుంచీ తల్లిదండ్రులను గౌరవించాలని, వాళ్ళ విలువ తెలియాలని స్కూలు పిల్లలు వాళ్లమ్మకి పాద పూజ చేసి ,అమ్మ దీవెనలు తీసుకో వాలని, ప్రభుత్వం చేపట్టిన 'అమ్మకు వందనం' అనే కార్యక్రమాన్ని జరపడం నిజంగా చరిత్రలో నిలిచిపోతుంది. దాని కోసం 2.50 కోట్ల రూపాయలని ప్రభుత్వం ఖర్చు పెట్టడం గొప్పవిషయం. ఈ కార్యక్రమం వలన తల్లిదండ్రుల గొప్పతనం పిల్లలకు తెలుస్తుంది. దాని వల్ల ఎంతో మంది తల్లిదండ్రులని వృద్ధాశ్రమంలో, అనాథ శ్రమంలో వేయడం చాలావరకు తగ్గించవచ్చు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషికి సెల్యూట్ కొడుతూ, ఈ కొత్త కార్యక్రమానికి విజయవంతం చేసి ఎన్నో రాష్ట్రాలకు, దేశాలకు, భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దాం. అమ్మ యొక్కగొప్పతనాన్ని చాటుకుందాం

- **కాసర సింధూ రెడ్డి** (అకడమిక్ డైరెక్టర్)
ప్రతిభా స్కూల్, జంగారెడ్డిగూడెం
9441084064

పోరాడదాం!

(మొదటి పేజీ తరువాయి)

మనం నిశ్శబ్దంగా ఉంటే ప్రమాదం. కేంద్రం తీరుపై పోరాడుదాం. జాతీయ స్థాయిలో మిగిలిన పార్టీల నేతలకు మన సమస్యను వివరిద్దాం. వారి మద్దతుతో కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం. రాజీనామాలు చేస్తే పార్లమెంట్‌లో మన గొంతు ఎవరు వినిపిస్తారు? అది కూడా మనం ఆలోచించాలి. అయితే, కేంద్రంతో పోరాడదామన్నానని ఎవరూ అతిగా స్పందించకండి. దానివల్ల రాష్ట్రంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుంది. ఆదివారం ఎంపీల సమావేశంలో బడ్జెట్‌పై చర్చించి పార్లమెంట్‌లో ఎలా వ్యవహరించాలో నిర్ణయిద్దాం. అప్పటిదాకా మిత్రధర్మ సమతూకంతో పోరాటం చేద్దాం'' అని చంద్రబాబు సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తే...

రాష్ట్రానికి అన్యాయం చేసిన వాళ్లెవరూ బాగుపడినట్లు చరిత్రలో లేదని సీఎం వ్యాఖ్యానించారు. శతాబ్దానికిపైగా చరిత్ర ఉందని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నామ రూపాల్లేకుండా పోవడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ''రాష్ట్ర విభజనే తీవ్ర అన్యాయం. అప్పట్లో కేసీఆర్ స్పష్టంగా తన అభిప్రాయం చెప్పారు. నేను మాత్రం రెండు రాష్ట్రాలకు సమన్యాయం కోరాను. జగన్ స్పష్టమైన వైఖరి చెప్పకుండా తప్పించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏపీలో జగన్‌తో, తెలంగాణలో కేసీఆర్‌తో లాలూచీ పడి రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించింది. రెండు రాష్ట్రాల్లోనూ టీడీపీని దెబ్బతీసేందుకే విభజన ప్రణాళికలు రూపొందించారు. ఆ సమయంలోనూ నేను బీజేపీ ముఖ్య నేతలందరినీ కలిశాను. ఏపీకి అన్యాయం నిజమేనని వారంతా నాతో కూడా అన్నారు. కానీ, పార్లమెంట్‌లో ఎవరూ నోరు విప్పలేదు. రాజ్యసభలో వెంకయ్యనాయుడు ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టి వదిలేశారు. ఆనాడు టీడీపీ ఎంపీల నిరసనను పట్టించుకోలేదు. మోదుగుల వేణుగోపాలరెడ్డి, నామా నాగేశ్వరరావు లాంటివారిపై కాంగ్రెస్ నేతలు దాడులకు తెగబడ్డారు. 'పెద్దమ్మ'నేకాదు...'చిన్నమ్మ'ను కూడా గుర్తుంచుకోవాలి అని సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో అన్నారేగానీ... ఏపీకి అన్యాయంపై చర్చించలేదు'' అని చంద్రబాబు విభజన విషయాలను నేతలకు గుర్తుచేశారు. రాష్ట్రావతరణ సంబరాలు కూడా నిర్వహించుకోలేని స్థితిలో మనం ఉన్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీ అంటే ఎందుకంత చిన్నచూపు....

ఆంధ్రప్రదేశ్ అంటే కేంద్రానికి ఎందుకంత చిన్న చూపు అని చంద్రబాబు ప్రశ్నించారు. ''కేంద్ర బడ్జెట్ దారుణంగా ఉంది. కర్ణాటక, ముంబై, అహ్మదాబాద్‌లకు బాగానే కేటాయింపులు చేశారు. ఏపీని మాత్రం ఎందుకంత చిన్నచూపు చూశారు? ఇలాగైతే ప్రజల్లోకి ఎలా పోతామని ఎంపీలు, నేతలు నన్ను ప్రశ్నించారు. రాష్ట్రానికి సంబంధించిన హామీలన్నీ నెరవేర్చామని బీజేపీ వాళ్లు భావిస్తున్నారు. కేంద్రం నుంచి ఇతర రాష్ట్రాలకు వచ్చినట్లుగానే మనకూ నిధులు వస్తున్నాయి తప్ప ఏపీని ఆదుకోవడానికి బీజేపీ నేతలు ప్రత్యేకంగా ఏమిచ్చారో? కేంద్రం నుంచి ఏం తెచ్చారో చెప్పాలి'' అని ఏపీ బీజేపీ నేతలను సూటిగా ప్రశ్నించారు.

విపక్షాలకు ఆ హక్కు లేదు

టీడీపీని విమర్శించే హక్కు ప్రతిపక్ష పార్టీలకు లేదని సీఎం మండిపడ్డారు. తాము తెగదెంపులు చేసుకుంటే చూసి ఆనందించాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయే తప్ప రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలపై దృష్టి పెట్టడం లేదన్నారు. ''బయటకొస్తే రాష్ట్రం గురించి పార్లమెంటులో గట్టిగా మాట్లాడేదెవరు? మమ్మల్ని విమర్శించే ప్రతిపక్షం పార్లమెంట్‌లో ఏం చేస్తున్నదో చెప్పాల''ని చంద్రబాబు నిలదీశారు. విపక్ష నేత జగన్, తన సొంత మీడియాలో ఇష్టానుసారంగా తప్పుడు కథనాలు వేస్తున్నారని మండిపడ్డారు. మీడియా అంతా ఏపీకి అన్యాయం జరిగిందని చెబుతుంటే, జగన్ మీడియా మాత్రం అదంతా టీడీపీ వల్లేనని రాసిందంటూ మండిపడ్డారు.

జాగ్రత్తగా ఉండకపోతే ఇబ్బందులే...

పాలన బాగోలేకపోతే ఏ ప్రభుత్వాన్నీ ప్రజలు ఉపేక్షించరని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజస్థాన్ ఉప ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని, అక్కడ బీజేపీ సిటింగ్ స్థానాలు మూడింటినీ కాంగ్రెస్ గెలుచుకున్నదని ఉదాహరించారు. మన జాగ్రత్తలో మనం ఉండకపోతే ఏపీలోనూ ఇబ్బందులు తప్పవని నేతలను హెచ్చరించారు. అతి విశ్వాసం వద్దని, ఎవరికివారు నియోజకవర్గాల్లో తమవంతుగా కష్టపడి పనిచేయాలని సూచించారు. 'దళిత తేజం-తెలుగుదేశం తరహాలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ, మైనారిటీ సదస్సులు నిర్వహించాలని, ఆ మేరకు రాబోయే మూడు నెలల్లో 175 నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులపై దృష్టి పెట్టాలని చెప్పారు. దళితుల్లో నాయకత్వ లక్షణాలున్నవారిని ప్రోత్సహించాలన్నారు. ప్రజల సెంటిమెంట్‌ను గ్రహించి ముందుకెళ్లాలని చెప్పారు.

ఆవేశం.. ఆందోళన వద్దు.. నేనున్నా

తాజా రాజకీయ పరిస్థితులను నిత్యం నిశితంగా గమనిస్తూనే ఉన్నానని సీఎం చెప్పారు. ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశం తర్వాత కేంద్ర సహాయసహకారాలు పూర్తిగా ఉంటాయన్న నమ్మకం కలిగిందన్నారు. కానీ, అందుకు విరుద్ధంగా బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని చెప్పారు. దీనిపై ఆందోళన చెందవద్దని, అన్ని విషయాలనూ పూర్తిగా పరిశీలించి తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుందామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనులపైనే దృష్టి పెట్టాలని సూచించారు. ''ప్రజలకు టీడీపీ ఏం చేసిందన్నదే మనకు మిగిలేది. భయాందోళనలు వద్దు... మరోసారి కేంద్రంతో చర్చించే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందన్న అనుమానం వచ్చిన వెంటనే తగిన నిర్ణయం తీసుకుంటాం'' అని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. సోమవారం నుంచి 175 నియోజకవర్గాలపై స్వయంగా దృష్టి సారిస్తానని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'దళిత తేజం-తెలుగుదేశం' కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని సూచించారు. ఏదిఏమైనా తొందరపడి ఎలాంటి వ్యతిరేక ప్రకటనలు.. వ్యాఖ్యలు చేయవద్దని మరోసారి హెచ్చరించారు.



కేవీపీ! పిచ్చి పట్టిందా?

- వెల్ ఖాళీ చేసి సీటు దగ్గరకు వెళ్లు
- రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కురియన్ ఆగ్రహం
- ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని సభలో రామచంద్రరావు నిరసన
- సహనం కోల్పోయిన పీజే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావుపై రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో జరిగిన మతఘర్షణల అంశంపై సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు.. ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్‌ను వ్యతిరేకిస్తూ ఆప్ ఎంపీలు శుక్రవారం రాజ్యసభలో ఆందోళన చేస్తున్న సమయంలో కేవీపీ వెల్‌లోకి వచ్చారు. బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిన తీరును నిరసిస్తూ ఆందోళన చేశారు. 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అని రాసున్న ప్లకార్డును చేత పట్టుకుని నిరసన తెలిపారు. దీంతో కురియన్ స్పందిస్తూ.. వెల్‌ను ఖాళీ చేసి సీట్ దగ్గరకు వెళ్లి కూర్చోవాలని కేవీపీకి సూచించారు. ఆయన కదలక పోవడంతో కురియన్ సహనం కోల్పోయారు. వెనక్కి పిలవాల్సిందిగా కాంగ్రెస్ సభ పక్ష నేత గులాం నబీ ఆజాద్‌కు సూచించారు. ''ఆయన (కేవీపీ) ఏం చేస్తున్నారు? ఎవరైనా ఇలా వ్యవహరిస్తారా? ఆయనకు ఏమైనా పిచ్చి పట్టిందా? దయచేసి వెనక్కి పిలవండి'' అని ఆజాద్‌ను ఉద్దేశిస్తూ కురియన్ అన్నారు. అంతేగాక కేవీపీపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కేవీపీకి మద్దతుగా కాంగ్రెస్ సభ్యులు మాట్లాడేందుకు ప్రయత్నించగా.. కురియన్ వారించారు. కాంగ్రెస్ సభ్యులు జైరాం రమేశ్, భవనేశ్వర్ కలిటా.. కేవీపీ దగ్గరకు వెళ్లి మాట్లాడారు. కాగా గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని మిత్రపక్షం టీడీపీ సహా విపక్షాలు వైసీపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. బీజేపీయేతర పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయవ్యవస్థలో జోక్యం చేసుకోం

- జడ్జీల వివాదంలో తలదూర్చం: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: భారత ప్రధాన న్యాయమూర్తి, మరో నలుగురు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తుల మధ్య జరుగుతున్న జగడాల మధ్య తాము తలదూర్చేది లేదని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసింది. 'అంతర్గత విషయాలను' న్యాయవ్యవస్థ సమర్థవంతంగా నిర్వహించగలదని శుక్రవారం పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటన చేసింది. 'దీని ప్రభావం సుప్రీంకోర్టుపై ఎలా పడుతుందో ప్రభుత్వం అంచనా వేసిందా' అన్న ప్రశ్నకు మంత్రి ప్రతికూలంగా సమాధానమిచ్చారు. న్యాయమూర్తుల మధ్య విభేదాలున్నాయన్న విషయం తమ దృష్టికి సుప్రీంకోర్టు తేలేదని ప్రకటనలో పేర్కొంది. ఈ అంశంపై రాజ్యసభలో సభ్యులు లేవనెత్తిన మూడు ప్రత్యేక ప్రశ్నలపై కేంద్ర న్యాయశాఖ సహాయమంత్రి పీపీ చౌదరి సమాధానమిచ్చారు. 'భారత రాజ్యాంగం ప్రకారం న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించే సంస్థ, తమ అంతర్గత విషయాలపై న్యాయవ్యవస్థ సమర్థవంతంగా వ్యవహరించగలదు, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది' అంటూ ఓ ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఆయన సమాధానమిచ్చారు. భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాపై నలుగురు సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిలు గత నెలలో పలు అంశాలపై సుప్రీంకోర్టు వ్యవహారశైలి ఏంబాగోలేదని తిరుగుబావుటా ఎగురవేశారు. దీంతో ప్రస్తుతం జస్టిస్ జే చలమేశ్వర్, రంజన్ గొగోయ్, ఎంబీ లోకుర్, కురియన్ జోసెఫ్‌లకు కీలకమైన కేసులను అప్పగించినట్టు సుప్రీంకోర్టు తాజా రోస్టర్‌లో వెల్లడించింది.

మన ఆధ్యాత్మిక సంపద మేడారం

(మొదటి పేజీ తరువాయి)



విచ్చేసిన ఆయన వనదేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య సమ్మక్క గద్దెలను చేరుకున్నారు.ఆ తర్వాత అమ్మవార్లకు మొక్కులు చెల్లించి, పట్టు వస్త్రాలను సమర్పించి, దేవతలకు నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించారు. ఆయన వెంట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఉన్నారు. అనంతరం ఉప రాష్ట్రపతిని కడియం ఘనంగా సన్మానించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరను తెలంగాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుపట్ల హర్షం వ్యక్తం చేశారు. జాతరకు రావడం సంతోషంగా ఉందని, అవతార మూర్తులను దర్శించుకోవడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఆది వేద కాలం నుండి వస్తున్న ఆచారాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మేడారం జాతరపై యావత్ దేశం దృష్టి పడాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున జనసమీకరణ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుందని, తెలంగాణా మధ్యప్రదేశ్ , ఛత్తీస్‌గఢ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి భారీ స్థాయిలో జనం జాతరకు వస్తున్న తీరు అద్భుతమన్నారు. జాతర దేశవ్యాప్తం కావాలని మరింత గుర్తింపు రావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పూర్వీకులు ప్రారంభించిన ఉత్సవాలు పండుగలు దేశ సమైక్యతను, విశిష్టతను చాటుతాయనీ, కాబట్టే అవంటే తనకిష్టమని చెప్పారు.




మళ్లీ ప్రత్యేక హోదా ఉద్యమం!

(మొదటి పేజీ తరువాయి)

ఉవ్వెత్తున ఎగిసింది. విద్యార్థులకు రాజకీయ, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎస్‌కేయూ విద్యార్థులు రోడ్డుపైకి రావడంతో పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. గురు, శుక్రవారాల్లో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తొలిరోజు పోలీసులు రంగంలోకి దిగి పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో తేలిపోయిందని, ఇక తాడో పేడో తేల్చుకుంటామని వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు ప్రకటించారు. తమ జీవితాలను పణంగా పెట్టి అయినా హోదా సాధించుకునేంత వరకు వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. శుక్రవారం అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై విద్యార్థులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా వైసీపీ నేతలు ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్త నదీం అహమ్మద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వై.వి.శివారెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ నేత సోమశేఖ రరెడ్డి, పార్టీ కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. అక్కడే వంటా-వార్పు చేసి సహపంక్తి భోజనం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించడంతో పాటు విభజన చట్టం హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు గుంతకల్లును రైల్వే జోన్‌గా ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని ఆందోళనకారులు ప్రకటించారు.

చంద్రబాబు తీరుపై ఆగ్రహం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరుపై ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రధాని నరేంద్ర మోదీ విస్మరించారని, కేంద్రానికి భయపడే చంద్రబాబు నోరు మెదపలేకపోతున్నారని వైసీపీ నేతలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాలే చంద్రబాబుకు ముఖ్యమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా నోరెత్తలేని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఎందుకు ఉండాల్సి వస్తోందని వారు ప్రశ్నించారు. బడ్జెట్‌లో నయాపైసా విదల్చనప్పుడు బీజేపీతో కలసి ఇంకా ఎందుకు ఉండాలని నిలదీశారు.



ఇదిగిదిగో భద్రాద్రి నమూనాలు!

పరిశీలించిన తెలంగాణ మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 2: భద్రాచలం సీతారామస్వామి ఆలయం అభివృద్ధి నమూనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఆర్కిటెక్ట్ ఆనందసాయి భద్రాద్రి ఆలయ అభివృద్ధికి మూడు నమూనాలను సిద్ధం చేశారు. వీటిని పరిశీలించిన మంత్రి తుమ్మల.. చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో మూడు నమూనాలు చక్కగా కుదిరాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సమక్షంలో తుది నమూనా ఖరారు చేస్తామని తెలిపారు. శ్రీరామనవమి లోపు పలు అభివ ద్ధి పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు.


కేంద్రానికి టీడీపీ గుడ్‌బై?

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ విషయంలో తీవ్రమైన అశ్రద్ధ వహిస్తోందని.. ఎంతో కాలంగా ఓపికతోనే ఉన్నామని.. ఇక తమ ఓపిక నశించిందని టీడీపీ ఎంపీలు వ్యాఖ్యానించడం గమనార్హం. రాజీనామాలే మార్గమని టీడీపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు భావిస్తున్నట్లు సమాచారం. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై టీడీపీ ఎంపిలు గురువారం రాత్రి సమావేశమై.. ఈ విషయంపై పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు సమాచారం అందించినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన చంద్రబాబు.. ఆదివారం టీడీపీ ఎంపీలు, కేంద్ర మంత్రులతో సమావేశం నిర్వహించి, తగిన నిర్ణయం తీసుకుందామని స్పష్టం చేసినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో సహాయం చేస్తుందని భావించినా అందుకు భిన్నంగా బడ్జెట్‌లో మొండిచేయి చూపడం తమను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని చంద్రబాబుకు ఎంపీలు వివరించినట్లు సమాచారం. ఇటువంటి సమయంలో పార్టీ పరంగా తాము కఠిన నిర్ణయాలు తీసుకోకపోతే.. ప్రజలు శాంతించేలా లేరని వారు తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు విరుద్ధంగా రాష్ట్రాన్ని విభజించారని.. అన్ని విషయాల్లోనూ పూర్తిగా అన్యాయం చేసినా.. బీజేపీ నేతలు న్యాయం చేస్తారన్న భావనతోనే తాము ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నామని.. ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రధాని మోదీ ఎన్నోసార్లు అవమానించినా రాష్ట్రం కోసం తాము సహించామని.. ఇక ఉపేక్షించేది లేదని యువ ఎంపీలు ఆగ్రహంగా ఉన్నారని తెలుస్తోంది. ఒకవైపు తమ పార్టీతో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో గెలిచి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో భాగస్వాములను చేసుకున్నారని.. మరోవైపు తమ ప్రత్యర్థి పార్టీ నేతలకు నిత్యం అపాయింట్‌మెంట్లు ఇస్తూ.. వారితో కూడా వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సిద్ధం అవుతుంటే.. దీనిని ఏమని భావించాలో అర్థం కావడం లేదని ఎంపీలు మండిపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏ మొహం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్లాలని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో తీవ్రమైన నిర్ణయం తీసుకుంటామని వారు చెప్పడం గమనార్హం. కేంద్ర బడ్జెట్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆవేదనతో ఉన్నారని టీడీపీ ఎంపిలు వ్యాఖ్యానించారు. దీంతో ఆదివారం పార్టీ ఎంపీలతో సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి భావించినట్లు సమాచారం. ప్రత్యేక హోదా కోసం వైసీపీ ఎంపీలు తమ సభ్యత్వాలకు రాజీనామాలు చేస్తామని చెబుతూనే.. మరోవైపు బీజేపీతో పొత్తుకు సిద్ధపడటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిందన్న విషయంలో పార్టీ మంత్రులు, ఎంపీలు రాజీనామా చేస్తే ప్రజల నుంచి అనూహ్యమైన మద్దతు వస్తుందని పార్టీ సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో వైసీపీ కూడా రాజీనామాలు చేస్తామని లీకులు ఇస్తుండటంతో వారి కంటే ముందే ఆపని టీడీపీ చేయడం వల్ల క్రెడిట్ దక్కుతుందని వ్యూహాన్ని రచిస్తున్నట్లు సమాచారం.

అది రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)



వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానికత ప్రకారం విద్యుత్ ఉద్యోగుల విభజన చేసిన తెలంగాణ విద్యుత్ సంస్థలు జారీ చేసిన మార్గదర్శకాలు, వాటిని ఆమోదిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన జీవోలను పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. వీటిని పలుసార్లు విచారించిన బెంచ్.. సమస్య రెండు ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కారం జరిగేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత బెంచ్ తన తీర్పును గతంలో వాయిదా వేసింది. శుక్రవారం ఆ వ్యాజ్యాలపై తీర్పు వెలువరించింది. విద్యుత్ ఉద్యోగుల విభజన ప్రక్రియను నాలుగు మాసాల్లో పూర్తి చేయాలని తెలంగాణ/ఏపీ ప్రభుత్వాలను బెంచ్ ఆదేశించింది. ఇందుకోసం మార్గదర్శకాల తయారీకి కొత్తగా కమిటీలు వేయడంగానీ లేదా ఉన్న జాయింట్ కమిటీని కొనసాగించడంగానీ చేయాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ రెండు మాసాల్లో చేయాలని, ఆ తర్వాత కమిటీలు నిర్ణయాల మేరకు నాలుగు మాసాల్లో విభజన జరగాలని తేల్చి చెప్పింది. స్థానికత ప్రకారం విభజన చెల్లదని, ఇప్పటికే రిలీవ్ చేసిన వారికి ఇతర ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాలని, వారి సీనియార్టీని కూడా ఆమోదించాలని ఆదేశించింది. రిలీవ్ చేసిన ఉద్యోగులకు ఏపీ సర్కార్ జీతభత్యాలు ఇచ్చి ఉంటే ఆ మొత్తాన్ని లెక్క కట్టి ఏపీకి చెల్లించేయాలని తెలంగాణను బెంచ్ ఆదేశించింది. విద్యుత్ ఉద్యోగుల బదిలీ, ఏపీకి కేటాయింపు చేసే అధికారం తెలంగాణకు లేదని బెంచ్ స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన చట్టంలో ఉద్యోగుల విభజనకు సంబంధించిన మార్గదర్శకాలను బెంచ్ తన తీర్పులో ఉదహరించింది. రాష్ట్రాల స్థానికత ఆధారంగా విభజన చేశారేగానీ.. కమలనాథన్, ప్రత్యూష్ సిన్హా కమిటీల సూచనల్ని అమలు చేయలేదని బెంచ్ తన తీర్పులో ఎత్తిచూపింది. పుట్టిన చోటు, ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని ఉద్యోగాలకు అర్హుడో కాదో చెప్పడానికి వీల్లేదని బెంచ్ పేర్కొంది. ఉద్యోగ భర్తీకి ఫలానా నివాస ప్రాంతం వారై ఉండాలని చెప్పే అధికారం పార్లమెంటు మాత్రమే ఉందని, రాష్ట్ర అసెంబ్లీకు లేదని తెలిపింది. దేశంలోని పౌరులంతా సమానమేనని స్పష్టం చేసింది. 1957లో ప్రాంతీయత ఆధారంగా ఏపీ రాష్ట్రంలో తెలంగాణకు ఉద్యోగావకాశాల్లో ప్రత్యేక ప్రయోజనాలను కల్పించేలా లోక్‌సభ చేసిన చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేసిందని హైకోర్టు బెంచ్ గుర్తు చేసింది.

నిజాలే ఉన్నాయా?

(మొదటి పేజీ తరువాయి)


నివేదిక అందజేసి తమ బాధ్యతను పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో సదరు నివేదికలోని నిజాలు వెలుగుచూస్తాయా? అన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా నిలుస్తోంది.

అధికార పార్టీ పెద్దల పేర్లున్నాయా!

విశాఖలో వేల కోట్ల విలువైన భూముల కబ్జా ఉదంతం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ముదపాక, కొమ్మాది, పరదేశీపాలెం భూములుసహా మాజీ సైనిక సిబ్బందికి కేటాయించిన భూముల కబ్జాలో మంత్రులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులతోపాటు ముఖ్యనేతలు కొందరికి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో కబ్జా పర్వంపై సమగ్ర దర్యాప్తు నిమిత్తం ప్రభుత్వం ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజాల్ నేతృత్వంలో 'సిట్'ను ఏర్పాటు చేసింది. అనంతరం నిరుడు జూన్ 28న రంగంలో దిగిన సిట్ విచారణ చేపట్టి ప్రాథమికంగా కొన్ని నివేదికలిచ్చింది. వీటి ఆధారంగా జిల్లా కలెక్టర్ ఫిర్యాదుతో పోలీసులు కదిలారు. భీమిలి మాజీ తహసీల్దార్ బి.టి.వి.రామారావు, ఉప తహసీల్దార్ రాజా శ్రీధర్, విశాఖ రూరల్ తహసీల్దార్ మజ్జి శంకరరావు, సర్వే విభాగం ఇన్‌స్పెక్టర్ గేదెల లక్ష్మి గణేశ్వరరావులపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేశారు. ఒక్క విశాఖ రూరల్ మండలంలోనే 600 ఎకరాల భూ రికార్డులు తారుమారైనట్లు ఫిర్యాదులు రావడంతో లోతుగా విచారణ నిర్వహించారు. ఈ మేరకు మొత్తం 2873 ఫిర్యాదులు రాగా వాటిలో 337పై దర్యాప్తు సాగింది. ఫిర్యాదుల సంఖ్య భారీగా ఉండటంతో తొలుత రెండు నెలలుగా నిర్దేశించిన విచారణ గడువును రెండుసార్లు ప్రభుత్వం పొడిగించింది. దీంతో ఆరు నెలలపాటు సిట్ విచారణ కొనసాగింది.

విచారణ సరే... చర్యలు పక్కాగా ఉంటాయా?

ఈ భూముల కుంభకోణంలో పెద్ద తలకాయలు ఉండటంతో సిట్ అధికారులు ప్రతి కేసు గురించి విడివిడిగా నివేదికలో పొందుపరిచారని సమాచారం. ఆ మేరకు అక్రమాలపై విచారణ సారాంశాన్ని, చర్యలను సమగ్రంగా నివేదించినట్లు సమాచారం. ఇక ఈ నివేదికపై తుది నిర్ణయం ప్రభుత్వానిదే కాగా, కబ్జాదారుల పేర్లను ప్రభుత్వం వెల్లడించడం




సందేహాస్పదమేనని ఫిర్యాదుదారులు అంటున్నారు. కాగా, ఇంతకుముందు వచ్చిన ఫిర్యాదులపై బహిరంగ విచారణ చేపడతామని రెవిన్యూశాఖ మంత్రి కె.ఇ.కృష్ణమూర్తి ప్రకటించారు. అయితే, రాజకీయ ఒత్తిళ్ల ఫలితంగా అది సాధ్యం కాలేదని తెలిసింది. ఆ తర్వాత సిట్ విచారణ పక్కాగానే సాగినా ప్రభుత్వం దీని ఆధారంగా చర్యలు తీసుకుంటుందో.. లేదోనన్న అనుమానాలు వెల్లువెత్తాయి. మరోవైపు సమాచార హక్కు చట్టం ద్వారా నివేదిక బట్టబయలు కాకుండా కాలహరణం చేసే అవకాశాలే ఎక్కువన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.



ఒక ఎఫ్ వెంకటేశ్.. మరో ఎఫ్?

పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్ చిత్రాలతో వరస విజయాలు సాధించిన అనిల్ రావిపూడి ఓ మల్టీస్టారర్‌కి ప్లాన్ చేస్తున్న విషయం తెలిసిందే. 'ఎఫ్2' పేరుతో రూపొందనున్న ఈ చిత్రంలో ఒక ఎఫ్‌గా వెంకటేష్ నటించనున్నారన్న విషయం తెలిసిందే. మరి మరో ఎఫ్‌గా నటించేది ఎవరైనా దానిపై చాలా ఊహాగానాలు వచ్చాయి. కొంతమంది పేర్లు కూడా వినిపించాయి. ఫైనల్‌గా వరుణ్‌తేజ్ ఆ క్యారెక్టర్ చెయ్యబోతున్నారని, రెగ్యులర్ షూటింగ్‌ను మేలో స్టార్ట్ చేస్తారని సమాచారం. ప్రస్తుతం హీరోయిన్ల ఎంపిక జరుగుతోంది. వరుణ్ తేజ్ తాజా చిత్రం 'తొలిప్రేమ' ఫిబ్రవరి 10న ఈ చిత్రం విడుదలవుతోంది.

ఆశా భోస్లేకు నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డ్



భారతీయ కళలను, సంస్కృతిని ప్రోత్సహించే టి.సుబ్బరామిరెడ్డి జాతీయ స్థాయిలో ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రముఖ దర్శకనిర్మాత యశ్ చోప్రాతో ఆయనది ఎనలేని బంధం. ఆ అనుబంధంతోనే యశ్ చోప్రా తనువు చాలించిన తర్వాత సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ తరఫున 2013 నుండీ నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డ్‌ను సినీ ప్రముఖులకు ప్రదానం చేస్తున్నారు. ఈసారి 2017కి గానూ ఈ అవార్డును ప్రముఖ నేపథ్య గాయని ఆశాభోస్లేకు అందచేయబోతున్నారు. ఇటీవల ముంబైలో సమావేశమైన టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ జ్యూరీ సభ్యులు సర్వశ్రీ బోనీకపూర్, మాధుర్ భండార్కర్, హనీ ఇరానీ, పద్మినీ కొల్హాపురి, సుబ్బరామిరెడ్డి... శ్రీమతి ఆశాభోస్లే పేరును నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవం ముంబైలో ఫిబ్రవరి 16న ఘనంగా జరగనుంది. మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్ రావుతో పాటు లతా మంగేష్కర్ చేతుల మీదుగా 'నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డు–2017'ను ఆశాభోస్లే అందుకోబోతున్నారు. ఈ కార్యక్రమంలో అమితాబ్ బచ్చన్, ఆమీర్ ఖాన్, షారుక్ ఖాన్, శ్రీదేవి, జయప్రద తదితరులు పాల్గొనబోతున్నారు.

ఫిబ్రవరి 10న 'తొలిప్రేమ'



• వరుణ్‌తేజ్

వరుణ్‌తేజ్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బివిఎస్ఎన్.ప్రసాద్ నిర్మించిన చిత్రం 'తొలిప్రేమ'. ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేద్దామనుకున్నారు. కానీ ఒకరోజు ఆలస్యంగా..అంటే ఫిబ్రవరి 10న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ "'ఇంటిలిజెంట్', 'తొలిప్రేమ' సినిమాలు ఒకే రోజున విడుదలవుతున్నాయని తెలియగానే అందరిలో చిన్నపాటి కన్ఫ్యూజన్ క్రియేట్ అయ్యింది. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఇదంతా జరిగింది. చివరకు ప్రసాద్‌గారితో నేనే మాట్లాడి 'తొలిప్రేమ' చిత్రాన్ని ఫిబ్రవరి 10న విడుదల చేద్దామని చెప్పాను. అయితే ఓవర్‌సీస్‌లో ఫిబ్రవరి 9న విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నాం. ఓవర్ సీస్ డిస్ట్రిబ్యూటర్స్‌తో మాట్లాడిన తర్వాత అక్కడ కూడా డేట్ ఫిక్స్ చేస్తాం" అన్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ "'తొలిప్రేమ' సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేద్దామని ముందుగా అనుకుని అనౌన్స్ చేశాం. అందుకు కారణం ఫిబ్రవరి 14న వేలెంటెన్స్ డే కావడం. అయితే 'ఇంటిలిజెంట్' సినిమా కూడా అదే రోజున వస్తుందని ప్రకటించారు. మెగా ఫ్యాన్స్ మధ్య కన్ఫ్యూజన్ కాకూడదని అనుకుని.. దిల్‌రాజుగారు మాట్లాడి ఫిబ్రవరి 10న మా 'తొలిప్రేమ' సినిమాను విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నాం" అన్నారు.

90 శాతం కామెడీతో 'రా..రా..'



శ్రీకాంత్ హీరోగా విజి చెరిష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రా..రా..'. శ్రీమిత్ర చౌదరి సమర్పణలో విజయ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో శ్రీకాంత్, నిర్మాత విజయ్, దర్శకుడు విజి చెరిష్ పాల్గొన్నారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ "నేను ఇప్పటి వరకు హారర్ సినిమా చెయ్యలేదు. ఇదే తొలి సినిమా అవుతుంది. చాలా రోజుల తర్వాత నా కెరీర్‌లో ఓ మంచి సినిమా చేశానన్న సంతృప్తి కలిగింది. తప్పకుండా ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుందన్న నమ్మకం కలిగింది. ఓ సినిమాని తెరకెక్కించే ప్రయత్నం ఆ దర్శకుడికి ఎదురైన ఘటనల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. మనుషుల్ని చూసి దెయ్యాలు ఎందుకు భయపడ్డాయి అనే పాయింట్‌తో ఈ సినిమాని తెరకెక్కించడం జరిగింది. ఇందులో హారర్‌తోపాటు కామెడీని కూడా మిక్స్ చెయ్యడం వల్ల ఆద్యంతం ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు" అన్నారు. నిర్మాత విజయ్ మాట్లాడుతూ "90 శాతం వినోదంతో కూడిన సినిమా ఇది. టాలీవుడ్‌లో ఉన్న హాస్యనటులంతా ఈ చిత్రంలో కనిపిస్తారు. ఫిబ్రవరి 23న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అన్నారు. శ్రీకాంత్, నజియా, సీత ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ర్యాప్‌రాక్ షకీల్, సినిమాటోగ్రఫీ: పూర్ణ.

నిత్య స్థానంలో కల్యాణి?



శర్వానంద్, సుధీర్‌వర్మ కాంబినేషన్‌లో ఒక సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలో సెట్స్ మీదకు వెళ్లనుంది. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీలో ఒక హీరోయిన్‌గా 'హలో' బ్యూటీ కల్యాణి ప్రియదర్శన్ ఎన్నికైనట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. మొదట ఈ సినిమా కోసం కాజల్, నిత్యామీనన్‌ను ఎంచుకున్నారు దర్శకుడు. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన కూడా ఇచ్చేశారు. అయితే కొన్ని కారణాల వలన నిత్యామీనన్ ఈ సినిమా నుంచి తప్పుకోగా.. ఇప్పుడు ఆ స్థానంలో కల్యాణిని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా ఇవ్వనున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే కల్యాణి ప్రియదర్శన్‌కు మరో బంపర్ ఆఫర్ వచ్చినట్లే.



అంతగా టచ్ చేయలేదు...

'రాజా ది గ్రేట్' సినిమాతో మళ్ళీ సక్సెస్ బాట పట్టిన మాస్ మహారాజా రవితేజ.. తక్కువ గ్యాప్‌లోనే 'టచ్ చేసి చూడు' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ చిత్రంలో రవితేజ ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. ఇదివరకు రవితేజ పోలీస్ పాత్రల్లో నటించిన 'వెంకీ', 'విక్రమార్కుడు', 'మిరపకాయ్', 'పవర్' చిత్రాలన్నీ మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. కాగా, ఈ చిత్రం ద్వారా విక్రమ్ సిరికొండ దర్శకుడిగా పరిచయమయ్యారు. దర్శకుడిగా ఈ చిత్రం అతనికి మొదటి ప్రయత్నమే అయినా, గతంలో రవితేజ హీరోగా నటించిన 'మిరపకాయ్' సినిమాకి స్క్రీన్ రైటర్‌గా పనిచేసిన అనుభవం వుంది. మరి ఆ అనుభవంతో రవితేజని ఈ సినిమాలో ఎలా చూపించారు? భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం కూడా రవితేజ గత పోలీస్ చిత్రాల మాదిరిగానే ప్రేక్షకులను ఆకట్టుకుందా? దర్శకుడిగా విక్రమ్ సిరికొండ మొదటి ప్రయత్నం ఫలించిందా?



చిత్రం: టచ్ చేసి చూడు
తారాగణం: రవితేజ, రాశీ ఖన్నా, సీరత్ కపూర్, ఫ్రెడ్డీ దారువాలా, సుహాసిని, మురళీశర్మ, సత్యం రాజేష్, జయప్రకాశ్, వెన్నెల కిషోర్ తదితరులు
ఛాయాగ్రహణం: చోటా కె. నాయుడు
కూర్పు: గౌతంరాజు
సంగీతం: జామ్8
నేపథ్య సంగీతం: మణిశర్మ
నిర్మాతలు: వల్లభనేని వంశీ మోహన్, నల్లమలుపు శ్రీనివాస్
కథ: వక్కంతం వంశీ
స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: విక్రమ్ సిరికొండ

మనం రివ్యూ

• రాశీ ఖన్నా

కథాంశం:

ఏసీపి కార్తికేయ (రవితేజ) ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్. డ్యూటీ తప్ప మరేమీ పట్టదు. ఫ్యామిలీ ఎమోషన్స్ జీరో. అలాంటి కార్తికేయ కొన్ని పరిస్థితుల వల్ల తన శైలిని మార్చుకుని.. కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం ప్రారంభిస్తాడు. అంతేగాకుండా, ఇంట్లో వాళ్ళ కోరిక మేరకు పుష్ప (రాశి ఖన్నా) అనే అమ్మాయిని పెళ్ళి చేసుకునేందుకు అంగీకరిస్తాడు. పుష్ప కూడా ఈ పెళ్ళికి అంగీకరించినా.. కొన్ని కారణాల వల్ల కార్తికేయని అపార్థం చేసుకుంటుంది. అయితే కార్తికేయ మంచితనం తెలుసుకుని అతనికి దగ్గరవ్వాలనుకుంటుంది. మరోవైపు.. కార్తికేయ కంపెనీలో పనిచేసే ఓ పెద్దాయన కొడుకుని హత్య చేస్తాడు ఇర్ఫాన్ లాలా(ఫ్రెడ్డీ దారువాలా). ఆ హత్యని కార్తికేయ చెల్లెలు చూస్తుంది. సాక్షి వివరాలు బయటకు రాకుండా, తన కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా.. ఆ ముద్దాయిని పట్టుకునేందుకు పోలీస్ అధికారి (షాయాజీ షిండే) సహకారం తీసుకుంటాడు కార్తికేయ. అయితే, అతని చెల్లెలు ఇచ్చిన సమాచారం తప్పుడు సమాచారమని.. ఇప్పటికే పోలీస్ రికార్డుల్లో చనిపోయిన ఇర్ఫాన్ ఈ హత్యను ఎలా చేస్తాడు? అంటూ పోలీస్ అధికారి ప్రశ్నిస్తున్నప్పుడే.. దూరం నుంచి ఇర్ఫాన్‌ను చూస్తుంది కార్తికేయ చెల్లెలు. ఇర్ఫాన్... కార్తికేయకు ఇంతకుముందే తెలిసి ఉండడంతో అతన్ని పట్టుకోవడానికి ట్రై చేస్తాడు. కానీ, అతను తెలివిగా తప్పించుకుంటాడు. అసలు ఇర్ఫాన్ ఎవరు? కార్తికేయకి, ఇర్ఫాన్ ఉన్న సంబంధమేమిటి? డ్యూటీ తప్ప మరేమి పట్టని కార్తికేయ.. తన ఫ్యామిలీకే ప్రాధాన్యత ఇవ్వడానికి దారితీసిన పరిస్థితులేంటి? కార్తికేయ జీవితంలో దివ్య (సీరత్ కపూర్) పాత్ర ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానమే 'టచ్ చేసి చూడు' చిత్రం.

విశ్లేషణ

"డ్యూటీ, ఫ్యామిలీ.. ఈ రెండింటిని బ్యాలెన్స్‌గా చూసుకోవాలి. అప్పుడే జీవితం బాగుంటుంది" అనే పాయింట్ చుట్టూ తిరిగే కథ ఇది. కథానాయకుడి పాత్రలో మూడు కోణాల్ని స్పృశిస్తూ ఈ కథని డిజైన్ చేసుకున్నారు. ఓ కోణంలో డ్యూటీ తప్ప మరేమి పట్టని వ్యక్తిగా హీరోని చూపిస్తే.. మరో కోణంలో ఫ్యామిలీకే ఇంపార్టెన్స్ ఇచ్చే వ్యక్తిగా చూపించారు. మూడో కోణంలో రెండింటిని బ్యాలెన్స్ చేసుకునే వ్యక్తిగా చూపించారు. ఇవన్నీ బాగానే కుదిరినా.. సినిమాలో హడావుడి ఎక్కువైపోవడం వల్ల కథనం మందగించింది. చెల్లెలు చేత సాక్ష్యం చెప్పించే సన్నివేశం, ఫ్యామిలీ ఎమోషన్స్ గురించి హీరో తండ్రి జయప్రకాష్ చెప్పే సన్నివేశం, అలాగే ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ సీన్, ముఖ్యమంత్రి ర్యాలీకి సంబంధించిన సన్నివేశం.. ఇలా కొన్ని సీన్స్ బాగానే వర్కవుట్ అయ్యాయి. అలాగే రాశి ఖన్నా, సుదర్శన్ మధ్య సాగే సరదా సన్నివేశాలు నవ్వు పుట్టిస్తాయి. అయితే ఓవరాల్‌గా ఆడియన్స్‌ను కట్టిపడేసే కథనం లేకపోవడం ఈ సినిమాకి మైనస్‌గా మారింది. అలాగే సుహాసిని, సీరత్ కపూర్ పాత్రలకు సరైన ముగింపు ఇవ్వకపోవడం కూడా మైనస్‌గానే చెప్పాలి.

నటీనటుల విషయానికి వస్తే.. మూడు ఛాయలున్న పాత్రలో రవితేజ నటన మెప్పిస్తుంది. అయితే, వీటిలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఉన్న ఎపిసోడ్స్‌లో తన నటన గుర్తుండిపోతుంది. రాశీ ఖన్నా పాత్ర పరిధి ప్రథమార్ధానికే పరిమితమైనా.. సరదా సన్నివేశాల్లో రాణించింది. పాటల్లో గ్లామర్‌తో ఆకట్టుకుంది. సీరత్ కపూర్ మరోసారి స్కిన్ షోకే పరిమితమైంది. విలన్‌గా ఫ్రెడ్డీ దారువాలా పాత్రలో విలనిజానికి స్కోప్ తక్కువ. నటన కూడా ఆకట్టుకోలేదు. మిగిలిన నటులంతా తమ పరిధి మేర ఓకే అనిపించుకున్నారు.

సాంకేతికంగా చెప్పుకోవాలంటే.. ఛోటా కె. నాయుడు ఛాయాగ్రహణం బాగుంది. జామ్ 8 కంపెనీ అందించిన పాటల్లో 'ఓయే పుష్పా', 'మనసా' పాటలు వినడానికి, చూడడానికి బాగున్నాయి. మణిశర్మ నేపథ్య సంగీతం కొన్ని సన్నివేశాల్లో మెప్పించినా, మరి కొన్ని సన్నివేశాలకి అవసరానికి మించి ఉన్నట్లుగా అనిపిస్తుంది. "బాధ్యతను మరిచిపోయి పనిచేస్తే జాబ్ మాత్రమే పోతుంది. బంధాల్ని మరచిపోతే.. జీవితం పోతుంది", "ఫ్యామిలీ అంటే ఓషన్ ఆఫ్ ఎమోషన్స్" వంటి డైలాగ్స్ బాగున్నాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి.

చివరగా.. అంతగా టచ్ చేయలేదు...

రేటింగ్.. 2/5

చిక్కినా అందమే!

'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన రాశి ఖన్నా చాలా తక్కువ టైమ్‌లో పెద్ద హీరోల సినిమాల్లో నటించి సక్సెస్‌ఫుల్ హీరోయిన్ అనిపించుకుంది. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో బొద్దుగా కనిపించిన రాశి రాను రాను తనను తాను కంట్రోల్ చేసుకుంటూ తన ఫిజిక్‌ని మరింత అందంగా తీర్చిదిద్దుకుంటోంది. సినిమా, సినిమాకి రాశిలో వస్తోన్న మార్పులు అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాయి. వరసగా సక్సెస్‌లు సాధిస్తున్న రాశి హీరోయిన్‌గా తనకొచ్చిన స్టార్‌డమ్‌ను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. డైట్ కంట్రోల్ చేస్తూ శారీరకంగా శ్రమిస్తూ ఇప్పుడు జీరో సైజ్‌కి చేరుకుంది రాశి. రవితేజతో కలిసి నటించిన 'టచ్ చేసి చూడు' ఈరోజు విడుదలైంది. వరుణ్‌తేజ్ సరసన నటించిన 'తొలిప్రేమ' ఫిబ్రవరి 10న విడుదల కానుంది. తెలుగులోనే కాకుండా తమిళ్‌లో కూడా సినిమాలు చేస్తూ బిజీ అయిపోయిందీ అందాల రాశి.




• కేథరిన్

'కనిదన్' రీమేక్‌లో...

తను చేసే ప్రతి సినిమా విభిన్నంగా ఉండాలని కోరుకునే నిఖిల్ ఇప్పుడు రీమేక్‌లపై ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. కన్నడలో సూపర్‌హిట్ అయిన కిరిక్ పార్టీ తెలుగు రీమేక్‌లో నటిస్తున్న నిఖిల్ ఇప్పుడు మరో రీమేక్‌పై దృష్టి పెట్టారు. తమిళ్‌లో అధర్వ హీరోగా నటించిన 'కనిదన్' చిత్రం తెలుగు రీమేక్‌లో నటించనున్నారు. ఠాగూర్ మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. 'కనిదన్' చిత్రానికి దర్శకత్వం వహించిన సంతోష్ తెలుగు రీమేక్‌ని కూడా రూపొందించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని తెలుస్తోంది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన కేథరిన్ త్రెసా హీరోయిన్‌గా ఎంపికైంది. ఈ సినిమా ఎప్పుడో ప్రారంభం కావాల్సినప్పటికీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు.

మార్స్‌పై రోవర్ సెల్ఫీ



అంగారకుడి ఉపరితలంపై నున్న ఓ కొండపై సెల్ఫీ తీసుకుం టున్న క్యూరియాసిటీ రోవర్.. వేరా రూబిన్ రిడ్జ్‌గా వ్యవహరి స్తున్న ఈ పర్వతంపై అధ్యయనం లో భాగంగా రోవర్ పలు చిత్రాల ను తీసి పంపింది. పనిలోపనిగా తన పరిస్థితిని చూపించే డజనుకు పైగా చిత్రాలనూ తీసింది. ఫొటోలో పైకి లేచిన రోవర్ చేతిని, అందులోని కెమెరాను చూడొచ్చు. ఈ ఫొటోల్లో రెండింటిని కలిపి ఇదిగో ఇలా సెల్ఫీ ఫోజులో నాసా విడుదల చేసింది.

ఐబూప్రోఫెన్‌తో గర్భిణికి హాని

- పిల్లల్లో పునరుత్పత్తిపై ప్రభావం



లండన్, ఫిబ్రవరి 2: నొప్పి నివారణ మాత్రగా వాడే ఐబూప్రోఫెన్ గర్భిణులకు చేటు చేస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గర్భంతో ఉన్న కాలంలో.. ముఖ్యంగా మొదటి 24 వారాల లో ఈ మాత్రలు తీసుకుంటే పుట్టబోయే పిల్లల పునరుత్పత్తిపై దుష్ప్రభావం చూపిస్తోందని చెప్పారు. ఐబూప్రోఫెన్ కారణంగా గర్భంలోని ఆడశిశువు అభివృద్ధిని ఇది నిరోధిస్తుందని తాజా పరిశోధనలో వెల్లడైందన్నారు. ఈ మాత్ర ప్రభావంతో ఆడపిల్లలు పెరిగి పెద్దయ్యాక అండోత్పత్తి సంబంధిత సమస్యలతో బాధపడతారని ఫ్రాన్స్‌కు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శిశువు గర్భంలో ఉన్న కాలంలో కేవలం రెండు నుంచి ఏడు రోజుల పాటు ఐబూప్రోఫెన్ మాత్ర ప్రభావానికి గురైతే అది అండాశయాన్ని కోలుకోలేనంతగా దెబ్బతీస్తుందని వివరించారు. అండోత్పత్తి దెబ్బతిన్న కారణంగా అండం ఉత్పత్తి, విడుదలకు తోడ్పడే రుతుచక్రం చిన్న వయసులోనే నిలిచిపోతుందని తెలిపారు. ఇక ఎక్కువ కాలంపాటు ఈ మాత్ర ప్రభావానికి లోనైతే శిశువుపై దీర్ఘకాలిక దుష్పరిణామాలు తప్పవని ఇనిస్టిట్యూట్‌కు చెందిన మజౌద్ గ్వెట్ వివరించారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో ఐబూప్రోఫెన్ వాడాల్సివస్తే తక్కువ మోతాదులో, అతి తక్కువ కాలంపాటు మాత్రమే ఉపయోగించాలని సలహా ఇచ్చారు.


భారత్, పాక్‌లలో..
పిల్లలపై అత్యాచారాలు దారుణం: ఐరాస



ఐక్యరాజ్య సమితి, ఫిబ్రవరి 2: భారత్, పాకిస్థాన్ దేశాలలో చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాలపై ఐక్యరాజ్య సమితి విచారం వ్యక్తం చేసింది. ఇటీవలి కాలంలో బాలికలపై జరిగిన అఘాయి త్యాలు దారుణమని సమితి అధికార ప్రతినిధి పేర్కొన్నారు. మహిళలను విద్యాధికులుగా, ఆర్థిక శక్తిమంతులుగా తీర్చిదిద్దేందుకు ఐరాస ప్రయత్నిస్తోందని వెల్లడించారు. ఈమేరకు భారత్‌లో చిన్నారులపై జరిగిన ఇటీవలి దారుణాలపై ఆయన స్పందించారు. ఈ రెండు దేశాలలో.. ముఖ్యంగా భారత్‌లో ఎనిమిది నెలల పసికందుపై జరిగిన అత్యాచార ఘటనపై సమితి ఆందోళన వ్యక్తం చేసింది. దేశ రాజధానిలో జరిగిన ఈ ఘటన అత్యంత దారుణమని పేర్కొంది. ఇక పాకిస్థాన్‌లో గత నెల లో ఏడేళ్ల చిన్నారిని పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేయడంపై జాతీయ స్థాయిలో ఆందోళన వ్యక్తమైందని సమితి అధికార ప్రతినిధి పేర్కొన్నారు. చిన్నారులపై ఈ దారుణాలను నిలువరించేందుకు ఆయా దేశాలకు సూచనలివ్వనున్నట్లు ఆయన తెలిపారు.

అభ్యంతరాలకు జవాబు చెప్పండి!

- బాండ్ల జారీపై ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఎలక్టోరల్ బాండ్ల జారీని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ప్రభుత్వ స్పందన ఏంటని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. బాండ్ల జారీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని సూచించింది. ఈమేరకు బాండ్ల జారీపై కేంద్రం తీసుకున్న నిర్ణయంపై సీపీఐ(ఎం) సుప్రీంను ఆశ్రయించిన విషయం తెలిసిందే! ప్రజాస్వామ్యానికి ఇది చేటు చేస్తుందంటూ ఆ పార్టీ నేత సీతారాం ఏచూరి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రభుత్వ ప్రతిపాదనకు సవరణలు చేస్తూ రాజ్యసభ తిప్పిపంపినా.. లోక్‌సభలో మెజారిటీ పేరుతో తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలను ప్రభుత్వం తోసిపుచ్చిందని ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన రాజకీయ అవినీతికి గేట్లు తెరుస్తుందని ఆయన ఆరోపించారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టింది. పిటిషన్‌లో పేర్కొన్న అభ్యంతరాలపై వివరణను ఫైల్ చేయాల్సిందిగా ప్రభుత్వ న్యాయవాదికి సూచించన ధర్మాసనం, కేసును వాయిదా వేసింది.

నేపాల్ అభివృద్ధికి భారత్ సాయం


- రాజకీయ స్థిరత్వానికీ తోడ్పతాం.. సుష్మాస్వరాజ్



కాఠ్మండు, ఫిబ్రవరి 2: నేపాల్‌తో చారిత్రక సంబంధాలను కొనసాగించేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ వెల్లడించారు. పొరుగ దేశంలో రాజకీయ స్థిరత్వానికి, అభివృద్ధికి తమ వంతు సాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఈమేరకు నేపాల్ ప్రెసిడెంట్ బిద్యా దేవీ భండారీ, ప్రధాని షేర్ బహదూర్ ద్యూబ, ప్రచండలతో చర్చల సందర్భంగా స్వరాజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల పర్యటనకు గానూ ఆమె గురువారం కాఠ్మండు చేరుకున్నారు. కాగా, ఎన్నికల తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని సీపీఎన్ మావోయిస్టు ఛైర్మన్ ప్రచండ వెల్లడించారు. ఎన్నికలలో మెజారిటీ లభించడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు ఆయన వివరించారు. దేశంలో రాజకీయ, ఆర్థిక స్థిరత్వం కోసం పొరుగు దేశాల సహకారం అవసరమని చెబుతూ.. ఇందుకు తగిన సాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మ స్వరాజ్‌తో జరిపిన చర్చలు సానుకూలంగా ముగిసాయని వివరించారు. నేపాల్‌కు అవసరమైన సాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందనే హామీ లభించిందని ప్రచండ పేర్కొన్నారు.

క్యాస్ట్రో కుమారుడి ఆత్మహత్య

- కుంగుబాటుతో బలవన్మరణం



హవానా, ఫిబ్రవరి 2: దివంగత క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రో పెద్ద కుమారుడు ఫిడెల్ క్యాస్ట్రో డియాజ్ బలార్ట్ (68) ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నాళ్లుగా తీవ్ర మానసిక కుంగుబాటుతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని క్యూబా అధికారిక మీడియా వెల్లడించింది. 1949 సెప్టెంబరు 1న క్యాస్ట్రో తొలి భార్య మిర్టా డియాజ్ బలార్ట్‌కు జన్మించిన ఆయనను క్యూబా ప్రజలు 'జూనియర్ క్యాస్ట్రో' అని, 'ఫిడిలిటో' అని పిలుచుకునే వారు. తండ్రి అధ్యక్షుడైనా ఈయన ఎప్పుడూ ఏ రాజకీయ పదవులు చేపట్టలేదు. అణు శాస్త్రవేత్త అయిన ఫిడిలిటో క్యూబా ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా, క్యూబా సైన్సెస్ అకాడమీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అయితే కొద్ది నెలలుగా ఆయన తీవ్ర ఒత్తిడితో కుంగుబాటుకు లోనయ్యారు. కొద్ది రోజులు ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స పొందిన ఆయన ఇటీవల డిశ్చార్జ్ అయ్యారు. తరచూ ఆస్పత్రికి వెళ్తూ మందులు వాడుతున్న ఆయన శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా, 90 ఏళ్ల వయస్సులో 26 నవంబరు 2016న ఫిడెల్ క్యాస్ట్రో తుదిశ్వాస విడిచారు. తండ్రి మరణించిన 15 నెలల తర్వాత ఫిడిలిటో ప్రాణాలు వదిలారు.

ఆరోగ్య బీమా.. అప్పుడే కాదు



కొత్త ఆర్థిక సంవత్సరంలో మొదలు: జైట్లీ

- 'ట్రస్టు లేదా బీమా'... రూపంపై కసరత్తు
- చికిత్స నగదురహితం.. ఖర్చు తిరిగిరాదు
- వాళ్లకివ్వాల్సింది ఇంతకుముందే ఇచ్చేశాం
- మధ్య తరగతికి మొండిచెయ్యిపై సమర్థన
- భవిష్యత్తులో ఆర్థిక పరిస్థితిని బట్టి ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఆయుష్మాన్ భారత్ కింద ప్రపంచంలోనే అతిపెద్దదిగా ప్రభుత్వం తన బడ్జెట్‌లో ప్రకటించుకున్న జాతీయ ఆరోగ్య రక్షణ పథకానికి (ఎన్‌హెచ్‌పీఎస్) శ్రీకారం చుట్టే తేదీ ఖరారు కాలేదు. దాని స్వరూపం కూడా ఇంకా రూపుదిద్దుకోలేదు. శుక్రవారం 'ఓపెన్ మాగజీన్' సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్వయంగా ఈ సంగతి వెల్లడించారు. అంతేకాకుండా వేతనజీవులకు ఇవ్వాల్సింది ఇంతకుముందు బడ్జెట్లలోనే తగినంత ఇచ్చేశామని చెప్పుకొచ్చారు. ద్రవ్య వెసులుబాటు అనుమతిస్తే రాబోయే బడ్జెట్‌లో ఉపశమనం కల్పిస్తామని చెప్పారు. ''నేను సమర్పించిన నాలుగైదు బడ్జెట్లను విశ్లేషిస్తే చిన్న పన్నుదారులకు క్రమానుగతంగా దాదాపు ప్రతిసారి ఊరట ఇస్తూనే వచ్చాను'' అని తాజా బడ్జెట్‌లో మధ్య తరగతికి మొండిచెయ్యి చూపడాన్ని సమర్థించుకున్నారు. పన్ను విధించదగ్గ ఆదాయ పరిమితిని రూ.2 లక్షలకు పెంచామని, పొదుపుపై అదనంగా రూ.50 వేల మేర మినహాయింపు ఇచ్చామని, ఇంటి రుణం చెల్లింపులో మరో రూ.50 వేలు ఊరట కల్పించామని, నిరుడు రూ.5 లక్షలదాకా ఆదాయం ఉన్నవారికి పన్నును 10 శాతం నుంచి 5శాతానికి తగ్గించామని ఏకరువు పెట్టారు. ప్రపంచంలో ఎక్కడా ఇంత తక్కువ పన్నుశాతం లేదని కూడా చెప్పారు. వ్యాపారులకు రూ.2 కోట్ల దాకా టర్నోవర్‌లో 6 శాతాన్ని అంచనా ఆదాయంగా లెక్కించి దానిపై మాత్రమే పన్ను విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక వ్యాపారులతో పోలిస్తే వేతనజీవులే సగటున అధిక పన్ను చెల్లిస్తున్నారని అంగీకరించారు. అందుకే రూ.40వేల ప్రామాణిక తగ్గింపును ప్రకటించామని, దీన్ని ఇంకా పెంచే అవకాశం ఉందన్నారు.

'మోదీ కేర్'కు ముహూర్తం ఖరారు కాలేదు

జాతీయ ఆరోగ్య రక్షణ పథకాన్ని 'మోదీ కేర్'గా నిపుణులు అభివర్ణిస్తున్న నేపథ్యంలో ఇది వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభమవుతుందని జైట్లీ ప్రకటించారు. దీనికింద నగదు రహిత వైద్యం చేస్తారు తప్ప ముందుగా ఖర్చుచేస్తే వాపసు రాదని కూడా స్పష్టం చేశారు. ''దేశంలో కొన్ని లక్షల పేద కుటుంబాలు ఆస్పత్రులలో చేరి చికిత్స పొందాల్సి వస్తే ఆస్తులు అమ్ముకోవడమో, అప్పులపాలు కావడమో తప్పడం లేదన్నది మనందరికీ తెలిసిందే. ఇప్పుడున్న జాతీయ ఆరోగ్య బీమా పథకం కింద కేవలం రూ.30వేల బీమా మాత్రమే వారికి అందుబాటులో ఉంది. ఇది ఏ మూలకూ చాలదు కాబట్టి భారీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయబోతున్నది'' అని గురువారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆయన ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం. కాగా, ఈ పథకం కింద 10 కోట్ల పేద కుటుంబాలకు (జనాభాలో 40%) ప్రయోజనం చేకూరాల్సి ఉంది. దీనికింద లబ్ధిదారులు ఆస్పత్రులలో రెండో, మూడో అంచె చికిత్స పొందాల్సి ఉంటుంది. వివిధ ప్రభుత్వ పెద్దాస్పత్రులు, ఎంపికచేసిన ప్రైవేటు ఆస్పత్రులు ఇందులో భాగస్వాములుగా ఉంటాయి. కాబట్టి ఓ 'ట్రస్టు' లేదా 'బీమా' నమూనాలో అమలవుతుంది తప్ప ఖర్చు వాపసు పథకంగా ఉండదని మంత్రి వివరించారు. మరోవైపు దీని నమూనాపై నీతి ఆయోగ్, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ కసరత్తు చేస్తున్నాయని వెల్లడించారు. ఇది బీమా పథకంలా అమలయ్యేట్లయితే పాలసీదారులు పెరిగేకొద్దీ ప్రీమియం తగ్గుతూ వస్తుందన్నారు.

అమలుపై నిపుణుల సందేహాలు

ఈ పథకంపై నిపుణులు హర్షం ప్రకటించినా ప్రారంభ నిధికింద రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించడంవల్ల అమలుపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఇది పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే నడుస్తుందని జైట్లీ భరోసా ఇస్తున్నారు. ఎన్‌హెచ్‌పీఎస్ అమలులోకి వచ్చాక అవసరాలకు అనుగుణంగా నిధులిస్తామని ప్రకటించారు. ఆ మేరకు నిధుల కొరత కూడా ఉండదని చెప్పారు. ''వచ్చే ఏడాది ప్రభుత్వ రాబడి సంతృప్తికరంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. ప్రత్యక్ష పన్ను వసూళ్లు వేగంగా పెరుగుతుండటమే ఇందుకు కారణం'' అన్నారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగినందువల్ల ఎగవేత చర్యలు పటిష్ఠంగా ఉంటాయిగనుక జీఎస్టీ వసూళ్లు ఊపందుకుంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతోపాటు ఆరోగ్య సంరక్షణ పథకాల విజయవంతం దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వనరులు సేకరించవచ్చునని సూచించారు. రెండో, మూడో అంచె నగరాల్లో తగిన సదుపాయాలతో ఆస్పత్రులు ఉన్నాయని గుర్తుచేశారు. వివిధ జిల్లాల స్థాయిలో ఆస్పత్రుల నిర్మాణం రాష్ట్ర పద్దులోనిది కనుక గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వాలు చొరవ చూపాలని సూచించారు.

వీలైనంత త్వరగా రామ మందిరం!

- యూపీ హోంగార్డు డీజీ ప్రతిజ్ఞ
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

లఖ్‌నవ్, ఫిబ్రవరి 2: అయోధ్య రామ మందిరాన్ని వీలైనంత త్వరగా నిర్మిస్తాం అంటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన పోలీసు ఉన్నతాధికారి ప్రతిజ్ఞ చేశారు. రెండు రోజుల క్రితం లఖ్‌నవ్ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో యూపీ హోంగార్డు విభాగం డీజీ సూర్య కుమార్ శుక్లా పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో ఆయనతో పాటు మరికొందరు రామ మందిర నిర్మాణంపై ప్రతిజ్ఞ చేశారు. రామ భక్తులుగా వీలైనంత త్వరగా అయోధ్యలో మందిర నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతినబూనారు. అనంతరం అంతా జై శ్రీరామ్ అంటూ నినదించారు. ప్రస్తుతం ఆ ప్రతిజ్ఞకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన శుక్లా తాను ఆ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేసిన మాట వాస్తవమేనని, కానీ, వైరల్ అవుతున్న వీడియో మాత్రమ ఎడిట్ చేసినదని వివరించారు. సామరస్యపూర్వకంగా అయోధ్య సమస్యను పరిష్కరించేందుకు అక్కడ చర్చలు జరిగాయని, రామ



మందిరంతో పాటు సమీపంలో మసీదు కూడా నిర్మిస్తే వివాదానికి చరమగీతం పాడొచ్చని ఆ సమావేశంలో నిర్ణయించామని శుక్లా తెలిపారు. ఇరు వర్గాల మధ్య చర్చలతో సమస్య పరిష్కరించుకోవాలన్న సుప్రీం కోర్టు సూచనను ఆయన గుర్తుచేశారు. అయితే తమ చర్చల వివరాలేవీ ఆ వీడియోలో లేవని అన్నారు. కాగా, ఐపీఎస్ అధికారిగా ఉన్నత విధుల్లో ఉన్న ఆయన ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని, ప్రతిజ్ఞ చేయడం సర్వీసు నిబంధనల ఉల్లంఘనేనని సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి అన్నారు.

ఇద్దరు భారత అమెరికన్ల హత్య

- తల్లీకొడుకులను కాల్చిన దుండగులు

వాషింగ్టన్, ఫిబ్రవరి 2: అమెరికాలోని భారత సంతతి తల్లీకొడుకులను గుర్తుతెలియని దుండగులు హత్యచేశారు. వాషింగ్టన్‌లోని వర్జీనియాలో వారి ఇంట్లోనే ఈ హత్యలు జరిగాయి. భారత్‌కు చెందిన రిషీ మన్వానీ (32) వాషింగ్టన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి మాలా మన్వానీ (65)తో కలిసి ఇక్కడే జీవిస్తున్నాడు. బుధవారం వారిరువురూ ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు వారిపై కాల్పులు జరిపారు. రెండు రోజులుగా రిషీ ఆఫీసుకు వెళ్లకపోవడంతో తోటి ఉద్యోగులు పోలీసులకు తెలియజేశారు. విచారణ కోసం పోలీసులు అతడి ఇంటికి వెళ్లగా మృతదేహాలు కనిపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు వారిని కాల్చి చంపారని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

పెద్దల సభలో రగడ

- ఎస్పీ, ఆప్ సభ్యుల ఆందోళన
- 50 నిమిషాలు రాజ్యసభ వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో మతఘర్షణల అంశంపై రాజ్యసభ అట్టుడికింది. 50 నిమిషాల పాటు సభకు అంతరాయం కలిగింది. సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ఆందోళన చేపట్టడంతో శుక్రవారం ఉదయం రాజ్యసభ వాయిదా పడింది. అనంతరం ఇటీవల ఎన్నికైన ఆప్ సభ్యులు.. ఎస్పీ ఎంపీలతో కలసి ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్‌ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్ కాస్‌గంజ్ అల్లర్ల విషయాన్ని ప్రస్తావిస్తూ.. మైనార్టీల ఇళ్లను ధ్వంసం చేశారని, వారిపై అక్రమంగా అట్రాసిటీ కేసులు బనాయించారని పేర్కొన్నారు. ఎస్పీ సభ్యులు ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ స్పందిస్తూ.. ఈ అంశంపై ప్రస్తావించేందుకు నోటీసు ఇవ్వాలని సూచించారు. కాగా బెంచీలపై నుంచే ఎస్పీ సభ్యులు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకువచ్చారు. జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించాలంటూ సభ్యులతో నిరసన విరమింపచేసేందుకు కురియన్ ప్రయత్నించినా వారు వినలేదు. వెల్‌లో ఎస్పీ, ఆప్ సభ్యులు నినాదాలు కొనసాగించారు. దీంతో కురియన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. జనవరి 26న కాస్‌గంజ్‌లో జరిగిన మత ఘర్షణల్లో ఓ వ్యక్తి మరణించాడు.



9వ తరగతి విద్యార్థి హత్య!

- తోటి విద్యార్థులే నిందితులు
- పరుగు పెట్టించి మరీ దాడి..
- ఢిల్లీ స్కూలులో ఘోరం
- ముగ్గురి అరెస్టు.. పరారీలో మరొకరు
- అనారోగ్యంతోనే.. యాజమాన్యం వాదన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశ రాజధాని ఢిల్లీలో మరో ఘోరం జరిగింది. తొమ్మిదో తరగతి విద్యార్థిని తోటి పిల్లలే హత్య చేశారు. కొందరు విద్యార్థులు దాడి చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని స్కూలు మరుగుదొడ్డిలో పడేశారు. ఈశాన్య ఢిల్లీ కరవాల్ నగర్‌లోని జీవన్ జ్యోతి స్కూలులో ఈ ఘటన జరిగింది. తొమ్మిదో తరగతి చదువుతున్న తుషార్ కుమార్ (16)ను గురువారం ఉదయం స్కూలులో తోటి విద్యార్థులు కొందరు కొట్టారు. పాఠశాల మరుగుదొడ్డి వద్ద అతడిపై దాదాగిరీ చేస్తూ పరిగెత్తించి మరీ దాడి చేశారు. ఆ దెబ్బలతో అపస్మారక స్థితిలోకి పోయిన తుషార్‌ను మరుగుదొడ్డిలో వదిలేశారు. ఆ తర్వాత టాయిలెట్‌కు వెళ్లిన కొందరు విద్యార్థులు తుషార్‌ను గమనించి ఉపాధ్యాయులకు చెప్పారు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. అతడు అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. అయితే స్కూలు యాజమాన్యం మాత్రం తుషార్‌ది హత్య కాదని, అతడు డయేరియాతో బాధపడుతూ స్కూలుకు వచ్చాడని.. అనారోగ్యం వల్లే మరణించి ఉండొచ్చని చెబుతోంది. దీనిపై తుషార్ తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు విషయాన్ని కప్పిపెట్టి.. నిందితులను కాపాడేందుకు ప్రయత్నిస్తోందంటూ స్కూలు ఎదుట ఆందోళన చేశారు. ఆరోగ్యం బాగోలేకపోతే తన బిడ్డను స్కూలుకు ఎందుకు పంపుతామని అతడి తల్లి ప్రశ్నించింది. 'నా బిడ్డను చంపేశారు.. నా బిడ్డను నాకు తెచ్చివ్వండి' అంటూ ఆమె విలపించింది. కొందరు విద్యార్థులు కలిసి తమ బిడ్డను కొట్టి చంపారని తోటి విద్యార్థులు చెప్పారని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్కూలులోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. అందులో తోటి విద్యార్థులు తుషార్‌పై దాదాగారీ చేస్తూ కొట్లాడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో దాడి చేసిన వారిలో ముగ్గురిని అరెస్టు చేశామని, మరో విద్యార్థి పరారీలో ఉన్నాడని చెప్పారు. కాగా, విద్యార్థి మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టానికి పంపారు. పోస్టుమార్టం నివేదిక వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. కాగా, గురుగ్రామ్‌లోని రేయాన్ స్కూలులో రెండో తరగతి విద్యార్థి ప్రద్యుమ్నను సీనియర్ విద్యార్థి చంపిన ఉదంతం మరువక ముందే మరో ఘటన జరగడం కలకలం రేపుతోంది.

దక్షిణాసియాలో భారత్ కీలకం

మా వ్యూహం అమలులో గొప్ప పాత్ర: అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి 2: భారత్‌పై అమెరికా మరోసారి ప్రశంసలు కురిపించింది. ఉగ్రవాద నిర్మూలనలో భారత్ కృషి అసమానమని పేర్కొంది. తమ దక్షిణాసియా వ్యూహంలో భారత్‌దే కీలక పాత్ర అని వెల్లడించింది.

ఉగ్రవాదంపై పోరులో భారత్ పాత్రపై విలేకరులు అడిగిన ప్రశ్నకు రక్షణశాఖ ముఖ్య అధికార ప్రతినిధి డానా వైట్ పైవిధంగా బదులిచ్చారు. ''భిన్న విధాలుగా ఉపయోగించుకునేలా భారత్‌తో మాకు అనుబంధాలున్నాయి. చాలా హుందాగా దక్షిణాసియా వ్యూహానికి భారత్ సహాయం చేస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలకు సహాయం కింద భారీగా నిధులు అందజేసింది. విమానాల నిర్వహణలోనూ భారత్ అద్భుతంగా సాయం చేస్తోంది. ఉగ్రవాదాన్ని ఎలా నిర్మూలించాలో భారత్‌ను చూసి నేర్చుకోవాలి. ఉగ్రవాదాన్ని తుదముట్టించే దిశగా భాగస్వాములను భారత్ ఏకం చేస్తున్న తీరును మేం కొనసాగిస్తే లక్ష్యం నెరవేరుతుంది. నేడు మా దక్షిణాసియా వ్యూహం విజయవంతంగా అమలవుతున్నదంటే కారణం భారతే''నని ఆమె పేర్కొన్నారు.

భారత్‌తో సంబంధాల మెరుగుకు ట్రంప్ మొగ్గు: హేలీ

భారత్-అమెరికా సంబంధాలను మరింత మెరుగుపరచడంపై అధ్యక్షుడు ట్రంప్ మొగ్గు చూపుతున్నారని ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ స్పష్టంచేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఆకాశమే హద్దు అని ఆమె వ్యాఖ్యానించారు. భారత్ శక్తిమంతమైన ఆర్థిక, సంస్థాగత సంస్కరణలు చేపట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసించారు. అమెరికాలో భారత రాయబారి నవ్‌తేజ్ సింగ్ సర్ణా తన నివాసంలో ఏర్పాటు చేసిన విందులో ఆమె పాల్గొన్నారు. కొందరు ప్రముఖ భారతీయ-అమెరికన్లతో జరిగిన ఈ విందు సమావేశంలో హేలీ



భారత్‌తో సత్సంబంధాల గురించి మాట్లాడారు. ఇరు ప్రజాస్వామ్య దేశాలకు చాలా విషయాల్లో ఒకేరకమైన విలువలున్నాయని.. ఇవి రెండు దేశాలు కలిసి పనిచేయడానికి సహకరిస్తున్నాయని చెప్పారు.

మనం స్పోర్ట్స్
శనివారం, 3 ఫిబ్రవరి, 2018
www.manamnews.com



పేసర్లు పట్టు బిగిస్తారు

ఫైనల్‌పై కెప్టెన్ పృథ్వీ షా

నాలుగోసారి ఐసీసీ వరల్డ్ కప్ టైటిల్‌ను సొంతం చేసుకునే క్రమంలో ఆస్ట్రేలియాతో జరగనున్న తుది పోరులో అద్భుతమైన ఫామ్‌లోవున్న తమ బౌలర్లు జట్టుకు ఆధిక్యతను ఇస్తారని.. ప్రత్యర్థిపై పట్టు బిగిస్తారని భారత అండర్-19 జట్టు కెప్టెన్ పృథ్వీ షా అన్నాడు. 'జట్టుకు అవసరమున్నపుడల్లా ఫాస్ట్ బౌలర్లు ప్రత్యర్థిని దెబ్బ తీస్తారు. ఎప్పుడు బౌలింగ్ చేయమంటే అప్పుడు బౌలింగ్ చేసేందుకు వాళ్లంతా సిద్ధంగా ఉన్నారు. వాళ్లల్లో కావలసినంత ఉద్రేకం ఉంది. అందరూ కమలేష్ నగర్‌కోటి, ఇషాన్ పోరెల్, శివం మవి పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నారు. ఇది జట్టు సభ్యులందరికీ ఉత్సాహాన్నిస్తోంది. మా ఫాస్ట్ బౌలర్లు సక్సస్ అయినప్పుడు మేము మరింత శక్తిని పొందుకుంటాం' అని షా అన్నాడు. ఒకరిద్దరు తొందరగా అవుటైనా ఒక మంచి భాగస్వామ్యంతో 250 నుంచి 300 వరకు స్కోరు చేస్తామని చెప్పాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆరంభంలోనే రెండు వికెట్లు పోయినప్పటికీ మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారని గుర్తు చేశాడు.



ఆపరేషన్ వరల్డ్ కప్

నేడు ఆస్ట్రేలియాతో తుది పోరు

నాలుగో టైటిల్‌పై భారత యువ సేన దృష్టి

ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్

మౌంట్‌మాంగనుయ్ (న్యూజిలాండ్): ఓటమి ఎరుగని జట్టుగా కొనసాగుతున్న భారత యువ జట్టు నాలుగో టైటిల్‌పై దృష్టి సారించింది. రాహుల్ ద్రవిడ్ శిక్షణలోని పృథ్వీ సేన రికార్డు బుక్కులను తిరగరాసేందుకు సిద్ధమైంది. ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్‌లో భాగంగా ఇండియా, ఆస్ట్రేలియా జట్లు శనివారమిక్కడ ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లు ఇండియా, ఆస్ట్రేలియా. ఎందుకంటే ఈ రెండు జట్లూ చెరి మూడుసార్లు చాంపియన్‌గా నిలిచాయి. అయితే శనివారం నాటి ఫైనల్లో ఆస్ట్రేలియా భరతం పట్టేందుకు ద్రవిడ్ శిక్షణలోని స్ఫూర్తిదాయక కుర్రాళ్లు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతున్న పృథ్వీ షా భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించే సూచనలు కనిస్తున్నాయి. భారత్‌కు అండర్-19 వరల్డ్ కప్ టైటిళ్లు అందించిన మహ్మద్ కైఫ్ (2002), విరాట్ కోహ్లీ (2008), ఉన్ముక్త్ చంద్ (2012) సరసన నిలవాలని షా పట్టుదలగా ఉన్నాడు. ప్రస్తుత ఫామ్‌ను బట్టి చూస్తూ ఫైనల్లో ఇండియానే ఫేవరెట్‌గా కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 100 పరుగులతో, సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 203 పరుగులతో గెలుపుతో పాటు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో భారత్ గెలిచి తిరుగులేని జట్టుగా నిలిచింది. ముఖ్యంగా సెమీఫైనల్లో పాకిస్థాన్‌పై గెలుపు భారత కుర్రాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. తొలుత 272 పరుగులు చేసిన భారత జట్టు తర్వాత పాకిస్థాన్‌ను 69 పరుగులకు ఆలౌట్ చేసింది. ద్రవిడ్ శిష్యులందరూ కలిసికట్టుగా రాణించారు. ఏదో ఒక రూపంలో ప్రతి ఒక్కరూ జట్టు విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్ భారత జట్టు సొంతం. షా, మనోజ్ కల్రా ఈ టోర్నీ ఆద్యంతం జట్టుకు శుభారంభాన్నిచ్చారు. మూడో నంబర్ స్థానంలో శుభ్‌మన్ గిల్ అసాధారణ ఫామ్ కనబరుస్తున్నాడు. నిజం చెప్పాలంటే ఈ టోర్నీలో అత్యంత స్థిరంగా రాణిస్తున్న గిల్‌పైనే ప్రస్తుతం అందరి దృష్టి ఉంది. సెమీస్‌లో పాకిస్థాన్‌పై మిరుమిట్లు గొలిపే అజేయ సెంచరీ చేసిన గిల్ తుదిపోరులోనూ ఆదే జోరును కనబరచాలని ఎదురు చూస్తున్నాడు. బౌలింగ్ విభాగానికొస్తే.. శివం మవి, కమలేష్ నగర్‌కోటి అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నారు. గంటకు 140 కిలోమీటర్ల వేగంతో నిప్పులు చెరిగే బౌలింగ్ చేస్తున్నారు. అయితే బలమైన ఆస్ట్రేలియన్ బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బ తీసేందుకు భారత బౌలర్లు తమ ప్రతిభకు మరింత పదును పెడుతున్నారు.

మరొక ముఖ్యమైన ఆటగాడు అభిషేక్ శర్మ. స్పిన్ బౌలింగ్‌ను సరిగ్గా ఎదుర్కోలేని ఆస్ట్రేలియా బలహీనతపై దెబ్బ కొట్టేందుకు అభిషేక్‌తో పాటు అనుకుల్ రాయ్ సిద్ధమయ్యారు. స్పిన్ బౌలింగ్‌తో పాటు మిడిలార్డర్‌లో విధ్వంసకర బ్యాటింగ్ చేయగల సత్తా ఉన్నవాడు అభిషేక్. ఈ టోర్నీలో భారత జట్టు ఫీల్డింగ్ కూడా అద్భుతంగా ఉంది. భవిష్యత్ స్టార్ క్రికెటర్లను తయారు చేయడంతో ఇండియా అండర్-19 వారసత్వాన్ని తీసుకుంది. భారత్ క్రికెట్‌లో సంచలనం సృష్టించగల సామర్థ్యం ప్రస్తుత యువకులకు ఉంది.

మరోవైపు తొలి మ్యాచ్‌లో ఓటమికి భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ఆస్ట్రేలియా తహతహలాడుతోంది. భారత్ చేతిలో ఓడిన తర్వాత ఆస్ట్రేలియా మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. సందర్భాన్ని బట్టి తమ ఆధిక్యాన్ని ప్రదర్శించగలమని జాసన్ సింఘా సేన గత రెండు మ్యాచ్‌ల్లో సంకేతాలు పంపింది. క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 31 పరుగులతో గెలిచిన ఆస్ట్రేలియా తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 127 పరుగులను నిలబెట్టుకుంది. మొత్తానికి తుదిపోరులో ఇండియా గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైంది.

ఇండియా అండర్-19:

పృథ్వీ షా (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, మనోజ్ కల్రా, హిమాన్షు రాణా, అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, హార్విక్ దేశాయ్, శివం మవి, కమలేష్ నగర్‌కోటి, ఇషాన్ పోరెల్, అనుకుల్ రాయ్, శివ సింగ్, ఆర్యన్ జుయాల్, అర్షదీప్ సింగ్, పంకజ్ యాదవ్.

ఆస్ట్రేలియా అండర్-19:

జాసన్ సంఘ (కెప్టెన్), విల్ సూథర్లాండ్, జేవియర్ బార్ట్‌లెట్, మాక్స్ బ్రియాంట్, జాక్ ఎడ్వర్డ్స్, జాక్ ఇవాన్స్, జర్రోడ్ ఫ్రీమన్, రియాన్ హాడ్లే, బాక్స్‌టర్ జె. హోల్ట్, నాథన్ మెక్‌స్వీనీ, జోనాథాన్ మెర్లో, లాయిడ్ పోప్, పరమ్ ఉప్పల్, ఆస్టిన్ వా.





గతం గతః: జాసన్ సంఘ

అయితే తొలి మ్యాచ్‌లో ఓటమి పాతబడిపోయిందని.. ఇప్పుడు తాజాగా ఫైనల్లో ఆడబోతున్నామని ఆస్ట్రేలియా కెప్టెన్ జాసన్ సంఘ అన్నాడు. '100 పరుగులతో ఓటమిపై బాధగా ఏమీ లేదు. ఫైనల్ అనేది మరో తాజా మ్యాచ్. మరో డిఫరెంట్ పిచ్‌పై మరో ఉత్కంఠను ఎదుర్కోబోతున్నాం. భారత జట్టు కూడా బాగా ఆడుతోంది. కానీ ఆరంభంలోనే రెండు వికెట్లు తీసి ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాం. ఏదైనా జరగొచ్చు' అని జాసన్ అన్నాడు. ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు అండర్ డాగ్‌గా బరిలోకి దిగుతోందన్న భారత కెప్టెన్ పృథ్వీ షా వ్యాఖ్యలను జాసన్ అంగీకరించలేదు. 'మేము అండర్‌డాగ్స్ అని చెప్పలేను. మేము ఫేవరెట్స్ కాదు. కానీ ఎటు వంటి జట్టునైనా ఓడించే సత్తా, సామర్థ్యం మాకుంది. తొలి మ్యాచ్ నుంచి మేము ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొన్నాం' అని జాసన్ వివరించాడు.

ఆస్ట్రేలియాకు గాయం బెడద

ఇదిలావుంటే ఫైనల్ మ్యాచ్‌కు ముందే ఆస్ట్రేలియా జట్టుకు గాయం బెడద పట్టుకుంది. ఆల్ రౌండర్ ఆరోన్ హార్డీ గాయపడడంతో అతని స్థానంలో వికెట్‌కీపర్/బ్యాట్స్‌మన్ ప్యాట్రిక్ రోను జట్టులోకి తీసుకున్నారు. గజ్జల్లో గాయానికి గురైన జాసన్ రాల్స్‌టన్ స్థానంలో హార్డీ జట్టులోకి వచ్చాడు.

సెమీస్‌లో సింధు

- సైనాకు చుక్కెదురు
- ప్రణీత్, కశ్యప్ అవుట్
- ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్



న్యూఢిల్లీ: హైదరాబాద్ స్టార్ షట్లర్, డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధు తన టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు మరో అడుగు ముందుకేసింది. కాగా మరో స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో సింధు సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారమిక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సింధు 21-12, 19-21, 21-11తో స్పెయిన్‌కు చెందిన ప్రపంచ 36వ ర్యాంక్ షట్లర్ బీట్రిజ్ కొర్రాలెస్‌పై పోరాడి గెలిచింది. ఈ మ్యాచ్‌లో సింధు ఆద్యంతం అటాకింగ్ గేమ్ ఆడింది. సెమీఫైనల్లో థాయ్‌లాండ్‌కు చెందిన రచనోక్ ఇంతనాన్‌తో సింధు ఆడుతుంది. తొలి గేమ్‌ను సొంతం చేసుకున్న సింధుకు రెండో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కొర్రాలెస్ 18-11తో నిలిచింది. కానీ సింధు వరుసగా ఏడు పాయింట్లు సాధించి స్కోరును 18-18తో సమం చేసింది. కానీ కొర్రాలెస్ నెట్ ప్లేతో రెండో గేమ్‌ను గెలిచి ఆశలు సజీవంగా నిలుపుకుంది. అయితే తొలి గేమ్‌ను గెలిచిన కోర్టులోకి వచ్చిన సింధు మూడో గేమ్ విరామం సమయానికి 11-6తో నిలిచింది. మళ్లీ పుంజుకునేందుకు కొర్రాలెస్ ప్రయత్నాలను సింధు సాగనివ్వలేదు. కాగా మరో మ్యాచ్‌లో సైనా 10-21, 13-21తో యూఎస్‌ఏకు చెందిన బీవెన్ ఝాంగ్ చేతిలో వరుస సెట్లలో ఓటమిపాలైంది.

ఇదిలావుంటే పురుషుల విభాగంలో భారత్‌కు నిరాశే ఎదురైంది. గురువారం శ్రీకాంత్ ఓటమిపాలు కాగా.. శుక్రవారం పారుపల్లి కశ్యప్, బి. సాయి ప్రణీత్ ఇంటిముఖం పట్టారు. పురుషుల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కశ్యప్ 16-21, 18-21తో చైనాకు చెందిన క్వియావో బిన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. 'లాంగ్ ర్యాలీస్‌ను ఆడటంలో ఇబ్బంది పడ్డాను. రెండో గేమ్‌లో నాకు అవకాశం వచ్చింది. కానీ అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాను. ముందుకొచ్చి వాటిని ముగించలేకపోయాను. కొంత మేరకు డిఫెన్స్ కూడా సరిగా ఆడలేకపోయాను. మరింత బాగా సిద్ధపడాల్సింది' అని మ్యాచ్ అనంతరం కశ్యప్ అన్నాడు. ఎనిమిదో సీడ్‌గా బరిలోకి దిగిన ప్రణీత్ ప్రత్యర్థి చౌ టీన్ చెన్ ఫాస్ట్ గేమ్‌ను ఎదుర్కోవడంలో విఫలమయ్యాడు. తొలి గేమ్‌లో 6-11తో వెనకబడ్డ ప్రణీత్ తర్వాత పుంజుకుని 14-14తో స్కోరును సమం చేశాడు. అయినప్పటికీ చెన్ తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లోనూ అదే తీరు కొనసాగింది. ఆరంభంలో 4-9తో వెనకబడ్డ ప్రణీత్ విరామం సమయానికి 10-11తో నిలిచాడు. అయినా రెండో గేమ్‌ను, మ్యాచ్‌ను కోల్పోయాడు. దీంతో పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరు ముగిసింది. పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన మను అత్రి బి. సుమీత్ రెడ్డి జోడీ 19-21, 19-21తో ఇండోనేషియాకు చెందిన మార్కస్ ఫెర్నాల్డి గిడియోన్, కెవిన సంజయ సుకముల్జో ద్వయం చేతిలో ఓటమిపాలైంది. మహిళల డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప, ఎన్. సిక్కిరెడ్డి జంట 17-21, 21-23తో చైనాకు చెందిన డు య్యూ, లి యూన్‌హ్యూ జోడీ చేతిలో ఓటమిపాలై ఇంటి ముఖం పట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో జక్కంపూడి మేఘన, పూర్విష ఎస్ రామ్ ద్వయం 10-21, 15-21తో థాయ్‌లాండ్‌కు చెందిన జాంగ్‌కోల్ఫన్ కిటిథరకుల్, రవిండా ప్రజోంగ్జాయ్ జంట చేతిలో ఓటమిపాలైంది.

మణికట్టు స్పిన్నర్లతో జాగ్రత్త

ప్రొటీస్‌కు మాజీ క్రికెటర్ నీల్ మెకంజీ సూచన



డర్బన్: వన్డే సిరీస్‌లో టీమిండియాకు గట్టి పోటీ ఇవ్వాలనుకుంటే మణికట్టు మాయాజాల స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌ల్లో జాగ్రత్తగా ఆడమని సౌతాఫ్రికా క్రికెటర్లకు మాజీ ఆటగాడు నీల్ మెకంజీ సూచించారు. కుల్‌దీప్ (3/34), చాహల్ (2/45) ఐదు వికెట్లు పంచుకోవడంతో సౌతాఫ్రికా 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. తర్వాత టీమిండియా 6 వికెట్లతో గెలిచి ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంతో నిలిచింది. 'డర్బన్‌లో మీరు సాధించిన స్కోరు ఎంతో తెలుసా? వరుస విరామ సమయాల్లో వికెట్లు కోల్పోవడం జట్టుకు ఉపయోగపడలేదు. యజ్వే ంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ముందుగా భారత పేసర్లు బౌన్సర్లతో బెదిరిం చారు. తర్వాత ఇద్దరు మణికట్టు స్పిన్నర్లు మిగతా పని పూర్తి చేశారు. వాళ్లు సౌతాఫ్రికాను కట్టిపడేశారు. పరుగులు తగ్గించారు. ముఖ్యంగా క్వింటన్ డికాక్, డేవిడ్ మిల్లర్ వంటి కీలకమైన వికెట్లు తీశారు' అని మెకంజీ అన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com